సాక్షి
వైఎస్సార్ జిల్లా
శనివారం । 4 । మార్చి । 2023



మెనూ.. మరింత మెరుగ్గా..!
అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ మెరుగ్గా అమలు చేస్తున్నారు. గర్భిణులకు రుచికరమైన భోజనం అందిస్తున్నారు. -IIలో..



ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట
ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పెద్దపీట వేశారని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. -IIలో

గరిష్టం/కనిష్టం
34.5/15.4

వాతావరణం
జిల్లాలో శుక్రవారం 15.4 – 34.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

6న అత్తిరాలలో గిరిప్రదక్షిణ

రాజంపేట రూరల్: ప్రముఖ శైవ పుణ్య క్షేత్రమైన అత్తిరాలలో ఈ నెల 6వ తేదీ సాయంత్రం 6 గంటలకు త్రేతేశ్వరస్వామి గిరిప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు గిరిప్రదక్షణ భక్త మండలి కమిటీ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిప్రదక్షిణలో పాల్గొన దలిచిన భక్తులు సాయంత్రం 5.30 గంటలకు అత్తిరాలకు చేరుకోవాలని కోరారు. ఈ సందర్భంగా త్రేతేశ్వరస్వామికి పల్లకి సేవ నిర్వహించనున్నట్లు చెప్పారు.

97.68 శాతం పింఛన్ల పంపిణీ

కడప రూరల్ : జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ పింఛన్ కానుక కింద వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ ప్రక్రియ జోరుగా సాగుతోంది. మూడో రోజైన శుక్రవారం 2,54,958 మందికి రూ. 70,38,09,750 పంపిణీ చేయాలి. సాయంత్రం ఏడు గంటల సమయానికి 2,49,067 మందికి రూ. 68,73,44,500 పంపిణీ చేశారు. దీంతో పింఛన్ల పంపిణీ ప్రక్రియ 97.68 శాతం పూర్తయింది.

18న ప్రత్యేక లోక్ అదాలత్

కడప అర్బన్: జిల్లా న్యాయసేవాధికారసంస్థ, కడప వారి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈనెల 18న ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు డీఎల్ఎస్ఏ చైర్మన్, ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీ.ఎన్. మూర్తి, డీఎల్ఎస్ఏ సెక్రటరీ, జడ్జి ఎస్. కవిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.ఇందులో కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసులు, వినియోగదారులకు సంబంధించిన కేసులు, ఐపీఆర్‌కు సంబంధించిన కేసులను మాత్రమే రాజీ చేసుకోవచ్చన్నారు. మరింత సమాచారం కోసం 08562–258622, 244 622 నంబర్లలో సంప్రదించాలని, ఈ మెయిల్ అడ్రస్: districts.ecourts.gov.in/kadapa, dlsakadapa@gmail.comను ఉపయోగించాలన్నారు. కక్షిదారులుస్పెషల్ లోక్ అదాలత్‌లో తమ కేసులను రాజీ చేసుకుని సత్వర న్యాయం పొందవచ్చని న్యాయమూర్తులు సూచించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

కడప అగ్రికల్చర్: ప్రకృతి వ్యవసాయంతోనే అధిక లాభాలు పొందొచ్చని ప్రకృతి వ్యవసాయం రాయలసీమ రీజియన్ సమన్వయకర్త చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ కార్యాలయంలో డీపీఎం రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో సిబ్బందికి రెండోరోజు విత్తన గుళికలు, పీఎండీఎస్ పంటలసాగుపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన గుళికల ప్రాముఖ్యత, చిరుధాన్యాల సాగుతో భూమిని 365 రోజులు కప్పి ఉంచే ప్రక్రియని తమ యూనిట్ పరిధిలోని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పీఎండీఎస్ (ప్రీమాన్ సూన్ డ్రై సోయింగ్) సాగుకు కావాల్సిన 30 రకాల విత్తనాల సీడ్ కిట్స్‌ను తయారు చేసుకుని రైతులకు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు. ఈ విధంగా పంటలను సాగు చేయడం వలన భూసారం పెరిగి అధిక దిగుబడులు రావటానికి ఆస్కారం ఉంటుందని అన్నారు. సీనియర్ కన్సల్టెంట్ సురేంద్రరెడ్డి, డీపీఎం రామకృష్ణంరాజులు మాట్లాడుతూ వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలసాగు విస్తీర్ణం పెంచే విధంగా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించాలని, పురుగులు, తెగుళ్లపై అవగాహన పెంచాలని సూచించారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



కడపలో అటవీశాఖ కార్యాలయంలో ర్యాలీని ప్రారంభిస్తున్న కడప డీఎఫ్ఓ సందీప్ రెడ్డి

కడప అర్బన్: వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కడప డివిజనల్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్(డీఎఫ్ఓ) పీవీ సందీప్‌రెడ్డి అన్నారు. ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం వన్యప్రాణులను సంరక్షించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు.కడప అటవీశాఖ కార్యాలయంలో ర్యాలీని డీఎఫ్ఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా సిబ్బంది 'అడవులను కాపాడుదాం, వన్యప్రాణులను సంక్షించుకుందాం, అడవికి నిప్పు– మానవాళికి ముప్పు' వచ్చని చెట్లు, ప్రగతికి మెట్లు' వంటి నినాదాలను చేపట్టారు. అనంతరం కడప నగర శివార్లలో ఎర్రచందనం , వన్యప్రాణుల గురించి అవగాహన సదస్సును చేపట్టారు. కార్యక్రమంలో స్టేట్ సెరికల్చరిస్ట్, తిరుపతి బయోటెక్నాలజీ రీసెర్చ్ సెంటర్ నుంచి అధికారులు నాగేశ్వర్, అసిస్టెంట్ డైరెక్టర్ శివకుమార్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ సుప్రజ, మాధవి, బాలసుబ్రమణ్యం, కె. ప్రసాద్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఓబులేసు, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీఓలు, ఏబీఓలు తదితరులు పాల్గొన్నారు.

వడివడిగా అడుగులు!

- శరవేగంగా సాగుతోన్న సెంచురీ ఫైబోర్డ్స్ పనులు
- నిర్ణీత గడువు కంటే ఏడాది ముందుగా ఉత్పత్తులు
- 2024 డిసెంబర్ నాటి రెండు దశల పనులు పూర్తి చేయాలని లక్ష్యం
- 2023 డిసెంబర్ నాటికే పూర్తి చేసే దిశగా యాజమాన్యం చర్యలు
- రూ.45కోట్లుతో బ్రహ్మంసాగర్ నుంచి నీటి సరఫరా పనులు



నిర్మాణంలో సెంచురీ ఫైబోర్డ్స్ పరిశ్రమ పనులు

పరిశ్రమ ఏర్పాటుకు కేటాయించిన భూమి: 589.23 ఎకరాలు

ప్రాజెక్టు వ్యయం: రూ.956 కోట్లు

ప్రత్యక్షంగా, పరోక్షంగా లభించనున్న ఉద్యోగాలు: 6662

ప్రతిరోజు వినియోగించనున్న కర్ర: 2000 టన్నులు

సాక్షి ప్రతినిధి, కడప: పారిశ్రామిక ప్రగతి సాధించాలనే కృతనిశ్చయంతో రాష్ట్రప్రభుత్వం వ్యవహరిస్తోంది. అందుకు తగిన ప్రణాళికలు రచిస్తూ, పెట్టుబడులను ఆహ్వానిస్తోంది. పారిశ్రామికవేత్తలకు అనువైన మౌలిక సదుపాయాల కల్పనలో వేగంగా నిర్ణయాలు తీసుకుంటోంది. వెరసి నిర్ణీత గడువు కంటే ముందే ఉత్పత్తులు ప్రారంభించే దిశగా పారిశ్రామికవేత్తలు వడివడిగా అడుగులు వేస్తున్నారు. ఈక్రమంలో జిల్లాలో సెంచురీ ఫైబోర్డ్స్ పరిశ్రమ నిర్మాణ పనులు శరవేగంగా రూపుదిద్దుకుంటున్నాయి.

వైఎస్సార్ జిల్లా బద్వేల్ సమీపంలోని నెల్లూరు రహదారిలో గోపవరం వద్ద ఏర్పాటవుతున్న సెంచురీ ఫైబోర్డ్స్ పరిశ్రమ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.956 కోట్లతో చేపట్టే ఈ పరిశ్రమ నిర్మాణానికి 2021 డిసెంబరు 23న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. వెంటనే పరిశ్రమకు అవసరమైన మౌలిక సదుపాయాల పట్ల దృష్టి సారించారు. నీటి కేటాయింపులు, విద్యుత్ సరఫరా అనుమతులు దక్కాయి. ఫైబోర్డ్స్ పరిశ్రమకు బ్రహ్మంసాగర్ నుండి 0.07 టీఎంసీల నీరు సరఫరాకు అవసరమైన పనులు రూ.45 కోట్లతో చేపట్టారు. 41. 8 కిలోమీటర్లు నిర్మాణ పనులకు 9 నెలలు గడువు విధించగా, 6నెలల్లోనే పనులు పూర్తి చేస్తున్నారు. అదేవిధంగా 132 కేవీ విద్యుత్ లైన్ నిర్మాణం కోసం ఇప్పటికే ఏపీఐఐసీ ట్రాన్స్‌కోకు రూ.19.1 కోట్లు చెల్లించింది. ఈ మేరకు విద్యుత్ లైన్ నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి. ప్రభుత్వానికి సెంచురీ ఫైబోర్డ్స్ పరిశ్రమ నిర్మాణం పట్ల ఉన్న చిత్తశుద్ధి ఆ పనుల వేగం స్పష్టం చేస్తోందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

నిర్ణీత గడువు కంటే ముందే ఉత్పత్తులు...

గోపవరం మండలంలో 589.23 ఎకరాలల్లో రూ.956 కోట్లతో సెంచురీ ఫైబోర్డ్స్ పరిశ్రమ ఏర్పాటుకు ఆ సంస్థ యాజమాన్యం శ్రీకారం చుట్టింది. ఇప్పుడా ఆ పెట్టుబడులు రూ.1600 కోట్లుకు చేరనున్నాయి. 2024 డిసెంబర్ నాటికి ఉత్పత్తి లక్ష్యం కాగా 2023 డిసెంబర్ నాటి రెండు దశల పనులు కూడా పూర్తి కానున్నాయి. ఏప్రిల్ నాటికే తొలిదశ పనులు పూర్తి చేసి ఉత్పత్తులు ప్రారంభించేందుకు యాజమాన్యం కృతనిశ్చయంతో ఉంది. అదే విషయాన్ని శుక్రవారం విశాఖపట్నం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో సంస్థ చైర్మన్ సజ్జన్ భజాంకా స్పష్టం చేశారు. ఈపనులు పూర్తి అయితే ప్రతిరోజు 2000 టన్నుల కర్రను వినియోగించనున్నారు. రెండవదశ తర్వాత రోజుకు 4000టన్నుల కర్ర పరిశ్రమకు అవసరమవుతుంది. ఈ మేరకు సుబాబుల్, జామాయిల్, సర్వి కర్రకు పూర్తి డిమాండ్ ఏర్పడనుంది. రైతులు సైతం తగిన రీతిలో సాగుకు సిద్ధపడ్డారు.

2662 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు...

సెంచురీ ఫైబోర్డ్స్ పరిశ్రమ పనులు పూర్తయితే ప్రత్యక్షంగా 2662 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి. అందులో 75శాతం స్థానికులకే ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే దాదాపు 2వేల మంది జిల్లాకు చెందిన వారికి ఉద్యోగాలు దక్కనున్నాయి. ఆమేరకు ఆ సంస్థ చైర్మన్ సజ్జన్ భజాంకా స్పష్టం చేశారు. స్కిల్స్ లేకున్నా సరే ఉద్యోగులుగా స్థానికులను ఎంపిక చేసుకొని వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పరోక్షంగా మరో 4వేల మందికి ఉపాధి లభించనున్నట్లు స్పష్టీకరించడం విశేషం. జిల్లాలో మరీ ముఖ్యంగా బద్వేల్ ప్రాంతంలో నిరుద్యోగులకు సెంచురీ ఫైబోర్డ్స్ పరిశ్రమ ఎంతో ఉపయోగకరంగా నిలవనుంది.

ఏప్రిల్ నాటికి తొలిదశ పనులు పూర్తి



సెంచురీ ఫైబోర్డ్స్ పరిశ్రమ పనులు అత్యంత వేగంగా సాగుతున్నాయి. తొలిదశ పనులు ఏప్రిల్‌కు పూర్తి చేయనున్నాం. వెంటనే ఉత్పత్తులు కూడా చేపట్టనున్నాం. రెండోదశ పనులు కూడా నిర్ణీత గడవు కంటే ఏడాదికి ముందే 2023 డిసెంబర్ నాటికి పూర్తి చేయనున్నాం.
– రమేష్‌కుమార్‌రెడ్డి, జీఎం, సెంచురీ ఫెలెబోర్డ్స్

అత్యంత ప్రాధాన్యతతో చేపడుతున్నాం



సెంచురీ ఫైబోర్డ్స్ పరిశ్రమకు మౌలిక వసతులు కల్పించడంలో ప్రాధాన్యత ఇస్తున్నాం. రూ.45కోట్లతో నీటి సరఫరా పనులు చేస్తున్నాం. 9 నెలలు గడువు విధించగా 6 నెలల్లో పనులు పూర్తి చేస్తున్నాం. యాజమాన్యం సైతం అదే కృతనిశ్చయంతో పరిశ్రమ పనులు వేగంగా చేపడుతోంది.
– శ్రీనివాసమూర్తి, జోనల్ మేనేజర్, ఏపీఐఐసీ

శనగల కొనుగోలులో దళారుల పాత్ర ఉండరాదు

- జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ

జమ్మలమడుగురూరల్: రైతుల వద్ద నుంచి ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న శనగల కొనుగోలు విషయంలో దళారుల పాత్ర ఉండరాదని జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. శుక్రవారం జమ్మలమడుగు ఆర్డీఓ జి. శ్రీనివాసులుతో కలసి కోవెలకుంట్ల రహదారిలో ఉన్న మార్కెట్‌యార్డ్‌ను సందర్శించారు. శనగలను పరిశీలించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హమీ మేరకు ప్రభుత్వం 5335 రూపాయలు క్వింటాకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలుచేస్తోందని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.దళారుల ప్రమేయం లేకుండా చూడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తిరుపతయ్య, సర్వేయర్ హరి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



శనగలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ

సోలార్ ప్లాంట్ల సందర్శన

మైలవరం (జమ్మలమడుగు రూరల్): మైలవరం మండల పరిధిలోని సోలార్ ప్లాంట్లను జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ జమ్మలమడుగు ఆర్డీఓ జి. శ్రీనివాసులతో కలసి సందర్శించారు. శుక్రవారం తలమంచిపట్నం, కోన అనంతరపురం, పొన్నంపల్లె, దొడియం, ద్దిరాల, రామచంద్రాయపల్లె గ్రామల్లో పర్యటించారు. పవర్‌గ్రిడ్‌లో జరుగుతున్న పనుల గురించి సోలార్ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయరామరాజు


కలెక్టర్ వి.విజయరామరాజు

బద్వేలు అర్బన్ : జగనన్న కాలనీల్లో ఇళ్లనిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం ఇళ్ళ నిర్మాణాల ప్రగతి, మున్సిపాలిటీలో జరుగుతున్న రీ సర్వేపై అధికారులతో చర్చించారు. బద్వేలు రెవెన్యూ డివిజన్ పరిధిలో బద్వేలు మున్సిపాలిటీతో పాటు పోరుమామిళ్ల, అట్లూరు మండలాల్లో ఇళ్ల నిర్మాణాల ప్రగతి తక్కువగా ఉందని, దీనిని మెరుగు పరిచేందుకు లబ్ధిదారులతో మాట్లాడి వేగవంతం చేయాలని సూచించారు. అలాగే ఆయా జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించి భూ సమస్యలు పరిష్కరించాలని సూచించారు. రూరల్ ఏరియాల్లో డ్రైనేజీల ఏర్పాటుకు నివేదికలు సిద్ధం చేయాలని కోరారు. ఈ నెల 3వ వారంలో మరోసారి సమీక్షా సమావేశం నిర్వహిస్తామని, ఈలోగా ఇళ్ల నిర్మాణాల్లో ప్రగతి సాధించాలని కోరారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ ఆకులవెంకటరమణ, గోపవరం తహసీల్దారు దామోదర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, ఎంపీడీఓ రామకృష్ణయ్య, హౌసింగ్ డీఈ రాజారత్నం, మున్సిపల్ డీఈ సుమన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుష్పగిరి కొండపై గుప్త నిధుల కోసం తవ్వకాలు

జనరేటర్‌లు, ఎగ్జాస్ట్ ఫ్యాన్‌లు ఇతర పరికరాలతో తవ్వకాలు





శిథిల ఆలయం నుంచి, సొరంగంలో నుంచి బయటకు వస్తున్న దుండగులు

సాక్షి ప్రతినిధి, కడప: పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరి కొండపై కొందరు దుండగులు గుప్త నిధుల కోసం భారీగా తవ్వకాలు జరుపుతున్నారు. కొండ శిఖరంలో నిర్మానుష్య ప్రదేశంలో ఉన్న శిథిల ఆలయంలో కొందరు దుండగులు పట్టపగలే తవ్వకాలు జరుపుతున్న ఘటన శుక్రవారం వెలుగు చూసినట్లు సమాచారం. పురావస్తు శాఖ సిబ్బంది కొండపైన పరిశీలనకు వెళ్లగా అక్కడ ఉన్న పోలీస్ రిపీటర్‌కు సుమారు కిలో మీటరు దూరంలో ఉత్తరం వైపున పుష్పాచలేశ్వర స్వామి ఆలయంగా పిలువ బడుతున్న శిథిల ఆలయంలో ఆరు నుండి ఏడు మంది తవ్వకాలు జరుపుతున్నట్లు గుర్తించినట్లు సమాచారం.

సంఘటనా స్థలంలో జనరేటర్

దుండగులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరపడానికి ఆధునిక పరికరాలు వాడుతున్నట్లు సమాచారం . కొండ పైభాగంలో ఉన్న శిథిల ఆలయ మండపంలో సుమారు 3 నుంచి 4 అడుగుల వెడల్పుతో 30 అడుగుల లోతుకు గుహలాగా తవ్వకాలు జరిపారు. తవ్వకాలు జరపడానికి అవసరమైన గాలి , వెలుతురు కోసం ఒక మినీ జనరేటర్, ఎగ్జాస్ట్ ఫ్యాన్‌లను వాడుతున్నారు. భారీ సమ్మెటలు, పలుగులు, పారలు, గోళాలు వాడుతున్నట్లు తెలుస్తోంది. కాగా భోజనం, వాటర్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకున్నట్లు సమాచారం. దుండగులు మోటార్ బైకులలో కొండ సమీపంలోని దుర్గమ్మ ఆలయం వద్దకు వచ్చి అక్కడి నుండి కొండ పైభాగానికి చేరుకుంటున్నట్లు తెలుస్తోంది.

పోలీసుల అదుపులో నిందితులు

పురావస్తు శాఖ సిబ్బందితో పాటు పోలీస్ రిపీటర్‌కు చెందిన పోలీసు సిబ్బంది ఒకరు అక్కడకు చేరుకోగా దుండగులు కొండపైన ఉన్న దట్టమైన పొదల్లోకి పరారైనట్లు సమాచారం. అందులో ఒక వ్యక్తిని వారు పట్టుకుని ఖాజీపేట పోలీసులకు అప్పగించారని తెలుస్తోంది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దుండగులకు చెందిన మూడు ద్విచక్ర వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. అయితే వారు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మిగిలిన దుండగులు పరారైట్లు తెలుస్తోంది. కాగా దీనిపై ఖాజీపేట పోలీసులను వివరణ కోరగా మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు మాత్రమే తెలిపారు.

ఊపందుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ

- పోలింగ్ స్టేషన్ల పరిశీలన పూర్తి
- తుది ఓటరు జాబితా సిద్ధం
- జోరుగా అభ్యర్థుల ప్రచారం

బద్వేలు/వేంపల్లె: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ఊపందుకుంది. పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటింగ్ ఈ నెల 13వ తేదీ జరగనుంది. మరో తొమ్మిది రోజుల గడువు ఉన్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. నాలుగు రోజుల కిందట తుది ఓటరు జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించింది. ఇప్పటికే పోలీంగ్‌స్టేషన్ల పరిశీలన పూర్తి చేశారు. వసతుల కల్పనపై దృష్టి సారించారు. రెండు రోజుల కిందట ఓటర్ స్లిప్పులు సైతం తహసీల్దార్ కార్యాలయాలకు చేరాయి. వీటిని బూత్‌లెవెల్ అధికారులు ఓటర్ల ఇంటి వద్ద అందజేస్తున్నారు. ఈ ప్రక్రియను ఎనిమిదో తేదీ లోపు పూర్తి చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

జిల్లాలోనే అత్యధిక ఓటర్లు

పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీకి సంబంధించి అన్ని జిల్లాల కంటే వైఎస్సార్ జిల్లాలోనే అత్యధిక ఓటర్లు ఉండటం విశేషం. ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ రెండింటిలోనే ఇదే పరిస్థితి. ఓటు చైతన్యంతోనే అత్యధికులు నమోదు చేసుకున్నారని అధికారులు చెబుతున్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో గత ఎన్నికలల్లో దాదాపు 2.58 లక్షల మంది ఓటర్లు ఉంటే ప్రస్తుతం దాదాపు 80వేల మంది అధికంగా 3,30,124 మంది ఓటు హక్కును పొందారు. అదే విధంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గతంలో 19 వేల మంది లోపే ఓటర్లు ఉండగా ప్రస్తుతం 9వేల మంది అధికంగా ఓటర్లు ఓటు హక్కును పొందారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి 49, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 12 మంది పోటీ

పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి 49 మంది , ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 12 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరికి ఇప్పటికే ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు గుర్తులు కేటాయించారు. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలు, రిజిస్టర్డ్ జాతీయ,రాష్ట్ర రాజకీయ పార్టీలు, తర్వాత స్వతంత్ర అభ్యర్థులకు పేరులోని మొదట అంగ్ల అక్షరాన్ని బట్టి వరుస కేటాయించారు. దీని ప్రకారం భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి(టీడీపీ), రాఘవేంద్ర నగరూరు(బీజేపీ), వెన్నపూస రవీంద్రారెడ్డి (వైఎస్సార్‌సీపీ), ఎస్.మల్లికార్జునరెడ్డి (అఖిలభారత కిసాన్ జనతా పార్టీ)లకు మొదటి నాలుగు వరుస స్థానాలు మిగిలిన స్వతంత్ర్య అభ్యర్థులకు తదుపరి స్థానాలు కేటాయించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో అందరూ స్వతంత్ర అభ్యర్థులే కావడంతో అల్ఫాబెట్ అక్షరాల ప్రకారం వరుస కేటాయించారు. సమయం తక్కువ ఉండటంతో వీరంతా జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

8వ తేదీలోపు ఓటరు స్లిప్పుల పంపిణీ

ఓటర్లకు సంబంధించి ఓటరు స్లిప్పులు ఇప్పటికే ఆయా మండలాల రెవెన్యూ కార్యాలయాలకు చేరాయి. వీటిని బీఎల్ఓలు పట్టణాలు, గ్రామాల వారీగా వేరు చేసుకుని ఓటర్లకు అందజేస్తున్నారు. ఇందులో ఓటరు వివరాలతో పాటు పోలింగ్ స్టేషన్ అడ్రస్ కూడా ఉంటుంది. ఓటరుకు అందజేసిన తర్వాత రసీదుపైన వారితో సంతకం చేయించుకుంటున్నారు. ఓటింగ్‌కు ఐదు రోజుల ముందు అంటే ఈ నెల 8వ తేదీ లోపు వీటిని అందించాలని సూచించారు.

అధికారుల కేటాయింపు

ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే పర్యవేక్షణ, ఎన్నికల కోడ్ వంటి అంశాలకు సంబంధించి పలువురు అధికారులకు విధులు కేటాయించారు. ఇందులో భాగంగా 36 టీంలను వీడియో సర్వైలెన్స్‌కు, 36 టీఎంలను ఫ్లయింగ్ స్క్వాడ్ బాధ్యతలను అప్పగించారు.వీరంతా ఇప్పటికే విధులు నిర్వహిస్తున్నారు. తాజాగా పీఓ, ఏపీఓల విధులు కేటాయించి ఈ నెల ఒకటో తేదీన పోలింగ్ నిర్వహణపై మొదటి విడత శిక్షణ ఇచ్చారు.వీరికి రెండో విడత శిక్షణ ఆరో తేదీ జరగనుంది. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక పోలింగ్ అధికారి, సహాయ పోలింగ్ అధికారి, ముగ్గురు ఇతర పోలింగ్ సిబ్బందిని నియమిస్తున్నారు. ఎన్నికల కోసం 21 మందిని సెక్టోరల్ అధికారులు, 21 మంది రూట్ అధికారులను నియమించారు.

టీచర్స్ నుంచి పెరుగుతున్న మద్దతు

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం ఇప్పటికే వైఎస్సార్‌సీపీ ఖాతాలో పడింది. ఈ నేపథ్యంలో టీచర్స్ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ తరపున ఎం.వి.రామచంద్రారెడ్డికి అన్ని వర్గాల నుంచి మద్దతు లభిస్తోంది. 33 ఉపాధ్యాయ సంఘాల మద్దతు పలకడం, ప్రైవేట్, ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా కలిసి రావడం శుభపరిణామంగా విశ్లేషకులు చెబుతున్నారు. అటు అనుబంధ ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, కత్తి నరసింహారెడ్డిలు బరిలో ఉన్నారు. గతంలో కత్తి నరసింహారెడ్డి విజయం సాధించినా వారి వల్ల ఉపాధ్యాయులకు కలిగిన ప్రయోజనాలు ఒక్కటీ కూడా లేవు. ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే తమ సమస్యలు పరిష్కారమవుతాయన్న నమ్మకం ఉపాధ్యాయుల్లో ఉంది. రామచంద్రారెడ్డి ఇప్పటికే ప్రైవేట్ యాజమాన్య సంఘ రాష్ట్ర అధ్యక్షునిగా సేవలు అందించిన గుర్తింపు ఉంది. దీంతో ఉపాధ్యాయ సంఘాలు మద్దతు ఇస్తున్నాయి. తాజాగా రెండు పీఈటీ సంఘాలు మద్దతు ప్రకటించాయి.. దీంతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎం.వి.రామచంద్రారెడ్డి గెలుపు తథ్యమని విశ్లేషకులు చెబుతున్నారు.



పోరుమామిళ్లలో ఓటరు జాబితా, స్లిప్పులను సరి చూసుకుంటున్న బీఎల్ఓలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ వివరాలు

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్
వైఎస్సార్	36	7,461	4,390	3,071	0
అన్నమయ్య	15	1,958	1,326	632	0
అనంతపురం	33	5,564	3,459	2,104	1
శ్రీసత్యసాయి	32	3,348	2,277	1,071	0
కర్నూలు	25	5,391	2,989	2,402	0
నంద్యాల	30	4,426	2,806	1,619	1
మొత్తం	173	28,148	17,247	10,899	2

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ వివరాలు

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్
వైఎస్సార్	86	81,317	52,245	29,063	8
అన్నమయ్య	21	20,594	14,014	6,574	6
అనంతపురం	77	68,341	45,659	22,672	10
శ్రీసత్యసాయి	52	43,310	29,686	13,620	4
కర్నూలు	66	61,633	42,040	19,592	1
నంద్యాల	56	54,929	38,695	16,230	4
మొత్తం	358	3,30,124	17,247	10,899	33

క్లుప్తంగా

మైలవరం నుంచి నీటి విడుదల

కడప కార్పొరేషన్ : ప్రస్తుత వేసవి కాలంలో జిల్లాలో తాగునీటి సమస్యలు రాకుండా జిల్లా కలెక్టర్ విజయ్ రామరాజుతో మాట్లాడి మైలవరం రిజర్వాయర్ నుంచి పెన్నానదికి 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయించినట్లు నగర మేయర్ కె.సురేష్ బాబు తెలిపారు. ఇప్పటికే ఎండలు మొదలైనందున పెన్నాలో నీరు ఆవిరైపోతోంది. పెన్నాలో నీరు ఇంకిపోతే జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కడప నగరంతోపాటు పెన్నా పరీవాహక ప్రాంతాల్లో నీటి సమస్యలు ఏర్పడే ప్రమాదముంది. ఈ నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా నీటిని విడుదల చేయించినట్లు ఆయన తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


కుమ్మరి శేఖర్ మృతదేహం

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : మైలవరం మండలంలోని వేపరాలకు చెందిన కుమ్మరి శేఖర్ (52) అనే వ్యక్తి గురువారం తమ గ్రామం వద్ద పెన్నానదిలో పడి గల్లంతయ్యాడు. రాత్రి వరకు గాలించినా కనిపించలేదు. మైలవరం పోలీస్ అధికారులు శుక్రవారం ఈతగాళ్లను రప్పించి గాలించారు. చివరకు ఓ గుంతలో కూరుకునిపోయి ఉండటం చూసి.. ఒడ్డుకు చేర్చారు. అయితే అప్పటికి మరణించి ఉన్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

అరటి పంట దగ్ధం


మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

లింగాల : లింగాల మండలం ఇప్పట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని హిరోజీపురం గ్రామంలో శుక్రవారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు అడవికి నిప్పు పెట్టడంతో మంటలు అరటి రైతు కుళ్లాయిరెడ్డి తోటలోకి ప్రవేశించాయి. ఫైర్ స్టేషన్ సిబ్బందికి సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే కుళ్లాయిరెడ్డికి చెందిన 4 ఎకరాల అరటి పంట దగ్ధమైంది. డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు, ప్లాస్టిక్ పైపులైన్, పోటు కర్రలు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో రూ.10 లక్షల దాకా నష్టం జరిగినట్లు బాధిత రైతు వాపోయాడు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే ఫైర్ స్టేషన్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి వెళ్లి మంటలు చుట్టూ పక్కల పంటలకు వ్యాపించకుండా అదుపు చేశారు. తీవ్రంగా నష్టపోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

మెనూ.. మరింత మెరుగ్గా..

- అంగన్‌వాడీ కేంద్రాల్లో రుచికరమైన భోజనం
- నిధులు పెంచిన ప్రభుత్వం

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు	2389
ఐసీడీఎస్ ప్రాజెక్టులు	13
చిన్నారులు	1,22,037
గర్భిణులు	17660
బాలింతలు	17318


అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న గర్భిణులు(ఫైల్)


చిన్నారులతో ప్రార్థన చేయిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

కడప కోటిరెడ్డి సర్కిల్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ మరింత మెరుగ్గా అమలు చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏమాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల్లో అనేక మార్పులు తీసుకొచ్చారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రుచికరమైన భోజనం అందిస్తున్నారు. అలాగే ఉన్నతాధికారుల పర్యవేక్షణలో మెరుగైన సేవలు అందిస్తున్నారు.

గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం సత్ఫలితాలు ఇస్తోంది. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా కూరగాయలు, ఆకుకూరలతో కూడిన పౌష్టికాహారం అందిస్తున్నారు. ఒకవైపు నిత్యావసర ధరలు పెరిగిన నేపథ్యంలో.. మెనూలో లోటుపాట్లు తలెత్తకుండా మెనూ చార్జీలను పెంచారు. గతంలో ఒక్కో బాలింత, గర్భిణికి రూ.3 చెల్లిస్తుండగా, ఆ ధరను రూ.5.77లకు పెంచింది. అలాగే చిన్నారులకు ఒక్కొక్కరికి రూ.1.70 అందిస్తుండగా, ఈ మొత్తాన్ని రూ.2.10లకు పెంచారు. ఇప్పటికే చిక్కీలు, ఖర్జూరం, అటుకలు, జొన్నపిండి, రాగిపిండితో కూడిన కిట్లను ప్రభుత్వం అందజేస్తోంది. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా జిల్లా ఉన్నతాధికారులు మెనూను పక్కాగా అమలు చేస్తున్నారు. లబ్ధిదారులకు ఐదు రోజులపాటు కోడిగుడ్లు, పాలు, రోజూ ఒకరకమైన వంటతో పౌష్టికాహారం అందేలా చర్యలు చేపట్టారు. అలాగే సూపర్‌వైజర్లు, సీడీపీఓలు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

భవనాల అద్దె పెంపు

జిల్లాలో 2389 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 994 సొంత భవనాల్లో, 341 సామాజిక భవనాల్లో, 1051 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. గతంలో అద్దె తక్కువ కావడంతో అంగన్‌వాడీ కేంద్రాలకు అన్ని సదుపాయాలతో కూడిన భవనాలను ఇచ్చేందుకు ఇంటి యజమానులు ఇష్టపడేవారు కాదు. తప్పనిసరి పరిస్థితుల్లో వసతి లేని ఇరుకు గదుల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాల్సి వచ్చేది. ఇకపై ఆ సమస్య లేకుండా అద్దె భవనాల్లో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు చెల్లించే మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే కేంద్రాలకు గతంలో రూ.1000 ఇవ్వగా, దాన్ని రూ.2000కు పెంచారు. పట్టణ ప్రాంతాల్లో రూ.4000 నుంచి రూ.6000 వరకు చెల్లిస్తున్నారు.

మెనూ ఇలా

- సోమవారం అన్నం, దోసకాయ పప్పు, కోడిగుడ్డు, కోడిగుడ్డు కూర
- మంగళవారం అన్నం, టమాట పప్పు, కోడిగుడ్డు కూర, పాలు
- బుధవారం అన్నం, ఆకుకూర పప్పు, కోడిగుడ్డు కూర, పాలు
- గురువారం ఎగ్‌ఫ్రైడ్‌రైస్, ఆకుకూర, కూరగాయలతో సాంబారు, పాలు
- శుక్రవారం అన్నం, బీరకాయ పప్పు, మునగాకు లేదా పాలకూరతో గుడ్డుకూర, పాలు
- శనివారం వెజిటబుల్‌రైస్, ఆకుకూర, కూరగాయలతో సాంబారు, కోడిగుడ్డు, పాలు

మెనూ చార్జీలు పెంచడం సంతోషదాయకం



అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు అందిస్తున్న మెనూ చార్జీలను పెంచడం సంతోషదాయకం. గతంతో పోల్చుకుంటే కూరగాయలు, ఆకుకూరలు రవాణా చార్జీలు పెరిగాయి. పాత మెనూ చార్జీలతో ఇబ్బందులు పడేవారం. ప్రభుత్వం చార్జీలు పెంచి ఊరట కల్పించింది. – లక్ష్మీదేవి, అంగన్వాడీ కార్యకర్త, కడప

హర్షణీయం



పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచడం హర్షణీయం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నారు. ఈ విధానం ఎంతో బాగుంది. ఎక్కువ మంది సద్వినియోగం చేసుకుంటున్నారు. – ఎలిజిబెత్‌రాణి, అంగన్‌వాడీ కార్యకర్త, ప్రకాశ్‌నగర్, కడప

పక్కాగా అమలు చేస్తున్నాం



ప్రభుత్వం ఆదేశించిన విధంగా మెనూను పక్కాగా అమలు చేస్తున్నాం. సూపర్‌వైజర్లు, సీడీపీఓలు నిరంతరం అంగన్వాడీ కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారు. ఈ అవకాశాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలి. – ఎంఎన్ రాణి, ఐసీడీఎస్ పీడీ, కడప

వాహనాల స్పెషల్ డ్రైవ్‌లో 197 కేసులు

కడప అర్బన్ : జిల్లాలో పోలీసులు చేపట్టిన వాహనాల స్పెషల్ డ్రైవ్‌లో శుక్రవారం మొత్తం 197 కేసులను నమోదు చేశారు. ఇందులో ప్రధానంగా హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలను నడిపిన వారిపై 173 కేసులు, సీటు బెల్ట్ ధరించకుండా వెళ్తున్న కార్లు, జీపులు, తదితర వాహనాల డ్రైవర్లపై 24 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలియజేశారు.

8 మంది అరెస్ట్

చెన్నూరు : చిన్నమాచుపల్లె రెవెన్యూ పరిధిలోని శాటిలైట్ సిటీ వద్ద గల గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల వెనుక వైపున శుక్రవారం సాయంత్రం పందుల పందెం ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 8 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేత


వెంకటసుబ్బమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అరుణకుమారి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్లకు చెందిన వలంటీర్ తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేశారు. మున్సిపాలిటీలోని 6వ వార్డు సచివాలయ పరిధిలో నివసిస్తున్న రాగిరి వెంకటసుబ్బమ్మ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడింది. ఆమె తిరుపతిలోని రుయా ఆసుపత్రిలో కొన్ని రోజులుగా చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ అరుణకుమారి శుక్రవారం తిరుపతికి వెళ్లి పింఛన్ డబ్బులు అందజేశారు. వలంటీర్‌కు లబ్ధిదారురాలు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉరి వేసుకొని యువతి ఆత్మహత్య


వైష్ణవి మృతదేహం

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగులోని లక్ష్మమ్మ చేను వీధికి చెందిన కంచం వైష్ణవి (22) అనే యువతి శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. సీఐ సదా శివయ్య ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్షుమ్మ చేను వీధికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రవికుమార్‌కు బంధువుల అమ్మాయి కంచం వైష్ణవితో మూడేళ్ల క్రిందట వివాహం జరిగింది. ఇటీవల 4 నెలల క్రిందట వీరికి కూతురు జన్మించింది. సాయంత్రం భర్త రవికుమార్ ఇంటి పై అంతస్తులో కూర్చొని కంప్యూటర్‌లో పని చేసుకుంటున్నాడు. అత్త ఇంటి దినుసుల కోసం కిరణా కొట్టుకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. సుమారు గంటన్నర తరువాత ఇంటికి వచ్చి అత్త చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే కుమారుడు రవికుమార్‌ను కిందికి పిలిచింది. వారు బాధితురాలిని కిందికి దించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. తమ కూతురు మరణంపై ఎటువంటి అనుమానాలు లేవని తండ్రి చలపతి తెలిపారు. అయితే అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లుగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నర్సింగ్ సూపరింటెండెంట్ ఇంట్లో చోరీ

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక రామేశ్వరం రోడ్డులోని ఒక అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న నర్సింగ్ సూపరింటెండెంట్ రాణమ్మ ఇంట్లో చోరీ జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. రాణమ్మ ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్నారు. శుక్రవారం ఉదయం విధులకు వెళ్లిన ఆమె మధ్యాహ్నం ఇంటికి రాగా అప్పటికే తలుపులు తెరచి ఉన్నాయి. బీరువా తలుపులు కూడా తెరవబడి, అందులో ఉన్న వస్తువులన్నీ చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. తర్వాత పరిశీలించగా బీరువాలో ఉన్న నాలుగున్నర తులాల బంగారు నగలతోపాటు రూ.40 వేల నగదు కనిపించలేదు. ఇంట్లో దొంగలు పడ్డారని భావించిన ఆమె రాత్రి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ నాగరాజు తెలిపారు.

పోగొట్టుకున్న నగదు అప్పగింత


పార్వతికి నగదు అందజేస్తున్న సీఐ ఇబ్రహీం

ప్రొద్దుటూరు క్రైం : పట్టణానికి చెందిన పార్వతి తమ వీధిలోని మహిళలతో కలిసి వస్త్రాలు కొనుగోలు చేసేందుకు శుక్రవారం సాయంత్రం వస్త్రభారతికి వెళ్లింది. ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కి కొర్రపాడు రోడ్డులోని వివేకానంద క్లాత్ మార్కెట్ వద్ద దిగింది. తర్వాత చూసుకోగా హ్యాండ్ బ్యాగ్ కనిపించలేదు. హ్యాండ్ బ్యాగ్‌లో రూ.50 వేలు డబ్బు ఉన్నాయని ఆమె తెలిపింది. దీంతో వెంటనే టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. టూటౌన్ ఇబ్రహీం వెంటనే స్పందించి కానిస్టేబుల్ బాబును పంపించారు. ఆటోను గుర్తించి అందులోని రూ. 50 వేలు ఉన్న హ్యాండ్ బ్యాగ్‌ను ఆమెకు అప్పగించారు. పార్వతి టూ టౌన్ సీఐ ఇబ్రహీం, కానిస్టేబుల్ బాబుకు కృతజ్ఞతలు తెలిపింది.

ఎర్రచందనం దుంగల స్వాధీనం

పీలేరు : మూడు వాహనాలతో సహా రూ.22 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, ఓ నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎఫ్‌ఆర్‌వో వెంకటరమణ తెలిపారు. వివరాలిలా వున్నాయి. ముందుగా అందిన రహస్య సమాచారం మేరకు మల్లెల క్రాస్ వద్ద అటవీ సిబ్బంది ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి సమయంలో కారు, ఎస్కార్టుగా వచ్చిన పల్సర్ బైక్‌లను ఆపేందుకు ప్రయత్నించారు. అయితే దుండగులు వాహనాలు ఆపకుండా కొంత దూరం ముందుకు వెళ్లి రోడ్డు పక్కన ఆపి పరారయ్యారు. కారును పరిశీలించగా అందులో ఏడు ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. అలాగే శుక్రవారం తెల్లవారుజామున పూతలపట్టు మండలం తేనేపల్లె టోల్‌ప్లాజా వద్ద వాహనాలు పరిశీలిస్తుండగా.. వచ్చిన కారును ఆపేందుకు ప్రయత్నించారు. దీంతో కారులో ఉన్న ఒకరు పరారు కాగా, రెండో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని పరిశీలించగా ఎనిమిది ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ నిందితుడు తమిళనాడుకు చెందిన నటరాజన్‌గా గుర్తించినట్లు ఎఫ్‌ఆర్‌వో తెలిపారు. ఈ దాడిలో అటవీ శాఖ సిబ్బంది ప్రతాప్, కుమారస్వామి, ప్రభుతేజ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు అరెస్ట్

సుండుపల్లె (వీరబల్లి) : సానిపాయి రేంజ్ రాయవరం సెక్షన్ టీ సుండుపల్లె బీటు పరిధిలోని మాదిగోని బావి రస్తా దగ్గర అటవీ శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. అక్రమ రవాణాకు కారులో సిద్ధంగా ఉంచిన 199 కేజీల బరువు గల 6 ఎర్రచందనం దుంగలతోపాటు కారు స్వాధీనం చేసుకున్నారు. వాటికి సంబంధించి తమిళనాడులోని వేలూరు జిల్లాకు చెందిన పేరుమాల్ దేవన్, శశికుమార్ రామ్మూర్తిని అరెస్టు చేశారు. వాహనాన్ని సీజ్ చేసి, వారిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. పట్టుకున్న దుంగల విలువ రూ.88537 ఉంటుంది. ఈ తనిఖీలలో ఎఫ్ఆర్ఓ పీరయ్య, డీఆర్ఓఎఫ్ రమేష్ బాబు, ఎఫ్‌బీఓలు బీ లక్ష్మీప్రసన్న, ఎ అంజనా స్వాతీ, పి లీలాశ్రీహరి, టి సాయి కృష్ణ, బేస్ క్యూప్, స్ట్రైక్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పించిన వ్యక్తి ఖాతానే ఖాళీ

– బ్యాంక్ మెసెంజర్ నిర్వాకం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటశివారెడ్డి

ఒంటిమిట్ట : భారతీయ స్టేట్ బ్యాంకులో మెసెంజర్‌గా ఉద్యోగం ఇప్పించిన వ్యక్తి ఖాతానే ఖాళీ చేశాడు ఓ ఘనుడు. ఒంటిమిట్ట భారతీయ స్టేట్ బ్యాంక్‌లో జరిగిన నగదు గోల్‌మాల్ గురించి తెలిసిందే. ఈ కేసుపై మొత్తం విచారణ పూర్తి కావడంతో శుక్రవారం స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో డీఎస్పీ వెంకటశివారెడ్డి వివరాలు వెల్లడించారు. రెడ్డయ్య నాయుడు ఒంటిమిట్టలో ఎంపీడీవోగా పని చేసే సమయంలో కాకి లక్ష్మీనారాయణ తాను పేద వ్యక్తిని ఉద్యోగం ఇప్పించాలని కోరాడు. తనకు ఉన్న పరిచయాలతో ఒంటిమిట్ట ఎస్‌బీఐ మేనేజర్‌కు తెలిపి 2014లో మెసెంజర్‌గా ఉద్యోగం ఇప్పించారు. ఎస్‌బీఐలో తన ఖాతాలో ఉన్న నగదు మొత్తాన్ని స్వాహా చేసినట్లు రెడ్డయ్య నాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. రెడ్డయ్య నాయుడు బ్యాంకు ఖాతాకు లబ్ధిదారుల మొబైల్ నంబర్ కాకుండా లక్ష్మీనారాయణ మొబైల్ నంబర్‌ను లింకు చేసుకుని, బ్యాంకు ఖాతా నుంచి నగదును పంపించుకోవడం జరిగింది. అలాగే మండలంలోని సాలాబాద్ గ్రామానికి చెందిన పేరూరు లక్ష్మి బ్యాంకు ఖాతాకు, కోనరాజుపల్లి గ్రామానికి చెందిన శివకుమారి బ్యాంకు ఖాతాకు లక్ష్మీనారాయణ మొబైల్ నంబర్‌ను లింకు చేశాడు. పేరూరు లక్ష్మి ఖాతా నుంచి రూ. 8.5 లక్షలు, శివకుమారి బాంకు ఖాతా నుంచి 7 లక్షలను తన అవసరాల కోసం, జల్సాలకు, అప్పులకు, క్రికెట్ బెట్టింగ్‌లకు ఉపయోగించాడు. తన మిత్రుడైన ఫైనాన్స్ వ్యాపారి మన్నేరు హరికృష్ణకు రూ.12 లక్షల నగదును పంపించాడు. మిగిలిన మొత్తాన్ని వన్ యాప్ క్రికెట్ బెట్టింగ్ ద్వారా అధిక మొత్తంలో నగదును సంపాదించాలనే ఉద్దేశంతో బెట్టింగ్ ఆడినట్లు తెలిపాడు. మొత్తం మీద ముగ్గురు ఎస్‌బీఐ ఖాతాల నుంచి రూ.72 లక్షల 23 వేల రూపాయల నగదును బదిలీ చేయడం జరిగిందని డీఎస్పీ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి, కాకి లక్ష్మీనారాయణను, మన్నేరు హరికృష్ణను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ పురుషోత్తం రాజు, ఎస్ఐ మధుసూదన్ రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని టోకరా

- ఉడాయించిన టీడీపీ మాజీ సర్పంచ్
- కేసు నమోదు



చాపాడు : మండలంలోని టీఓపల్లెకు చెందిన టీడీపీ మాజీ సర్పంచ్, ఆ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి గిద్దలూరు సుబ్బరాయుడు, ఆయన కుమారుడు సుమేష్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి నిరుద్యోగుల నుంచి లక్షలు వసూలు చేసి ఉడాయించిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వారు వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు చెందిన ఆరుగురు నిరుద్యోగ యువతీయువకుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.50 వేల నుంచి లక్షకు పైగా వసూలు చేశారు. మొత్తం రూ.7.30 లక్షలు రాబట్టుకుని పత్తా లేకుండా పోయారు. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం నక్కలవాండ్లపల్లె గ్రామానికి చెందిన పెట్ల శివనందించి ఫిర్యాదు మేరకూ శుక్రవారం టీడీపీ మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, అతని కుమారుడు సుమేష్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కేసీ రాజు తెలిపారు. సుబ్బరాయుడు డబ్బులు వసూలు చేసిన వారిలో శివనందినితోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన సుధాకర్, మౌనిక, పవన్‌కుమార్, సింధు, ఇందిరా ఉన్నారు. వీరందరూ కలసి తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరుతున్నారు.

పశుసంవర్ధకశాఖ జేడీ కార్యాలయంలో నిరసన

డీడీ అచ్చెన్నపై చర్యలు తీసుకోవాలని డిమాండ్


కార్యాలయంలో నిరసన చేపట్టిన డీడీలు, ఏడీపీ, పశువైద్యులు

కడప అగ్రికల్చర్ : బహుళార్థ పశువైద్యశాలలో(వీపీసీ) డీడీగా పని చేస్తున్న అచ్చెన్నపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పశుసంవర్ధశాఖ అధికారుల సేవా సంఘం, పశువైద్యుల సేవా సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జిల్లా పశుసంవర్ధశాఖ జేడీ కార్యాలయంలోని జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి శారదమ్మ చాంబర్‌లో జిల్లాలోని పలువురు డీడీ, ఏడీలు, పశువైద్యాధికారులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. డీడీ అచ్చెన్నపై చర్యలు తీసుకోవడంతోపాటు ఆయనకు ఉన్న డ్రాయింగ్ పవర్స్‌ను తొలగించడం, వీసీపీలో ఏడీలు, పశువైద్యాధికారితో పాటు అటెండర్లకు ఆపేసిన జీతాలను మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. తాము విధులకు డీడీ అచ్చెన్న ఆటంకం కలిగించడంతోపాటు ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై నిజ నిర్ధారణ కమిటీ, విచారణ కమిటీ విచారణ చేపట్టి చాలా రోజులు అయినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇందుకు తాము శని, ఆదివారాలు సహాయక నిరాకరణను చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమానికి దూరంగా ఉండటంతోపాటు రిపోర్ట్స్ ఏవీ సబ్‌మిట్ చేయబోమన్నారు. అత్యవసర చికిత్సలకు తప్ప మిగతా వాటికి వైద్య సేవలందించబోమని తెలిపారు. ఈ విషయమై జేడీ(జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి) శారదమ్మతోపాటు యూనియన్ నాయకులు పశుసంవర్ధశాఖ రాష్ట్ర డైరెక్టర్ అమరేంద్రకుమార్‌కు ఫోన్‌లో సమస్యను వివరించారు. కార్యక్రమంలో పశువైద్యుల సేవా సంఘం జిల్లా నాయకులు శివరామిరెడ్డి, లక్ష్మినరసయ్య, గురివిరెడ్డిలతోపాటు పసుసంవర్ధశాఖ అధికారుల సేవా సంఘం జిల్లా నాయకులు శ్రీధర్‌లింగారెడ్డి, నేతాజీ, ఏఎన్ శ్రీనివాసులు, చంద్రశేఖర్‌లతోపాటు పలువురు డీడీలు, ఏడీలు, పశువైద్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట

ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : శాసన మండలి ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పెద్దపీట వేశారని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న సాయి శివానీ కల్యాణ మండపంలో శుక్రవారం మధ్యాహ్నం పెద్దముడియం, సాయంత్రం జమ్మలమడుగు, మైలవరం మండలాలకు చెందిన కార్యకర్తలతో కలిసి ఆయన ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి దివంగత నాయకుడు పి. శివారెడ్డి చిత్ర పటాలకు నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాజకీయాల్లో 40 ఏళ్ల అనుభవం ఉంది అని చెప్పుకునే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు పరచని సంక్షేమ పథకాలు.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసి ప్రజల మన్ననలు అందుకుంటున్నారని తెలిపారు. సచివాలయ వ్యవస్థను ప్రవేశ పెట్టి లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో దళారుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రజలకు అందిస్తున్నారని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. టీడీపీ నాయకులు ప్రజల్లో అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని, వాటిని తిప్పికొట్టాలని తెలియజేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న రామచంద్రారెడ్డిని, పట్టభద్రుల ఎమ్మెల్సీగా బరిలో ఉన్న రవీంద్రనాథరెడ్డిని గెలిపించుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో పి. గిరిధర్‌రెడ్డి, వెంకట శివారెడ్డి, పలువురు మండల నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు

అగ్ని ప్రమాదంలో నగదు, ధాన్యం, బీరువా, వస్తువులు దగ్ధం

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని మద్దిరేవుల గ్రామం బిల్డింగ్ దళితవాడకు చెందిన కత్తి శంకరయ్య గృహంలో శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఫ్రిజ్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో.. ఇల్లంతా మంటలు చెలరేగాయి. దీంతో ధనం, ధాన్యం, దుస్తులు, వస్తువులు కాలిపోయాయని కుటుంబ సభ్యులు వాపోయారు. గ్రామస్తులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అలాగే అగ్నిమాపక శాఖకు సమాచారం చేరవేశారు. లక్కిరెడ్డిపల్లి నుంచి ఫైర్ ఇంజన్ వచ్చి మంటలు ఆర్పడంతో ప్రమాదం నుంచి బయటపడ్డామని బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ తుమ్మల చంద్రమ్మ, వీఆర్‌ఓ ప్రసాద్, సెక్రటరీ శివయ్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను బాధిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. జరిగిన నష్టం నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని వీఆర్‌ఓ ప్రసాద్ తెలిపారు.

క్లుప్తంగా

డిస్కౌంట్‌తో లేపాక్షి వస్తువుల అమ్మకాలు

కడప కల్చరల్: కడప నగరం కోటిరెడ్డిసర్కిల్‌లోని లేపాక్షి హస్తకళల ఎంపోరియంలో వస్తువులను తగ్గింపు ధరలకు విక్రయించనున్నామని శాఖ మేనేజర్ బీపీ వెంకటేశం తెలిపారు. రాష్ట్ర హస్తకళలు, చేనేతశాఖ ఆధ్వర్యంలోని ఈ షోరూం అమ్మకాల్లో రాష్ట్రంలో రెండవ స్థానంలో ఉందని, ఉగాది,శ్రీరామ నవమి తదితర పండుగలను పురస్కరించుకుని ప్రజలకు హస్తకళలను అందుబాటులో ఉంచాలన్న ఉద్దేశ్యంతో ఈ డిస్కౌంట్ ప్రకటిస్తున్నామన్నారు. హస్త కళాకారులు తయారు చేసిన వస్తువులపై 40 శాతం వరకు డిస్కౌంట్ ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు. గృహాలంకార వస్తువులతోపాటు గిఫ్ట్ ఆర్టికల్స్‌కు ఈ డిస్కౌంట్ వర్తిస్తుందని, మార్చి 30వ తేదీ వరకు ఈ పథకం అమలులో ఉంటుందని ఆయన తెలిపారు.

6న వాహనాల వేలం పాట

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఈ నెల 6న వేలం పాట వేయనున్నట్లు కడప ఎస్‌ఈబీ సీఐ విశ్వనాథ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాట కడప ఎస్‌ఈబీ స్టేషన్ ఆవరణలో జరుగుతుందన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు పూర్తి వివరాలకు కడప ఎస్‌ఈబీ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రొద్దుటూరు క్రైం : ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ హెల్పర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపోలో శుక్రవారం ఎన్నుకున్నారు. డిపో సెక్రటరీగా ఎంపీ రావు, గ్యారేజీ సెక్రటరీగా ఈ.రాంబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారు మర్యాదపూర్వకంగా డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డిని కలిసి తమ కమిటీ ఎన్నిక పత్రాలను అందించారు. అసోసియేషన్ రాష్ట్ర నాయకులు జి.బాలయ్య, చీఫ్ అడ్వైజర్ ఎస్ఎస్ నారాయణ పాల్గొన్నారు.

6,7న మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు

కడప రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఈనెల 6, 7వ తేదీల్లో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, జిల్లా మహిళా విభాగం చైర్మన్ శాంతమ్మ, కన్వీనర్ భారతి తెలిపారు. శుక్రవారం అసోసియేషన్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. కడప నగరంలోని జియోన్ కళాశాల మైదానంలో సాయంత్రం 3 నుంచి జిల్లాలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో అన్నిశాఖల ఉద్యోగులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నిర్మలాజ్యోతి, నాయకులు జయలక్ష్మి, సుహాసిని, గౌరీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వేమన వారియర్స్ విజయం

వైవీయూ:యోగివేమన విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని నిర్వహిస్తున్న క్రీడాపోటీల్లో శుక్రవారం బోధనేతర సిబ్బందికి క్రికెట్ పోటీలు నిర్వహించారు. శుక్రవారం వేమన క్రీడాప్రాంగణంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో వేమన వారియర్స్ జట్టు వేమన లెవన్ జట్టుపై విజయం సాధించింది.

5న పెన్షనర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆదేశాల మేరకు కడప జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ కార్యవర్గ సర్వ సమావేశాన్ని 5వ తేదీ ఉదయం 10.30 గంటలకు కడపలోని నేక్ నామ్ కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు పెన్షనర్ల సంఘం అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ చెన్నారెడ్డి, సెక్రటరీ రామ్మూర్తి నాయుడు తెలిపారు. సమావేశానికి కడప బ్రాంచ్‌లో నమోదైన ప్రతి సభ్యుడు, జిల్లాలోని మండల, తాలుకా యూనిట్‌లోని కార్యవర్గ సభ్యులందరూ హాజరై నూతన కార్యవర్గ ఎన్నిక విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో రేషన్ బియ్యం బస్తాలను అక్రమంగా నిల్వ ఉంచిన గోడౌన్‌పై శుక్రవారం సాయంత్రం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. అందులో ఉన్న 20 బస్తాల నూకలు, 246 చౌకబియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యం ప్యాకెట్లను ప్రభుత్వ గోదాముకు తరలించారు.

విద్యకు మించిన ఆస్తి మరొకటి లేదు

వీరపునాయునిపల్లె : సమాజంలో విద్యకు మించిన ఆస్తి మరొకటిలేదని జిల్లా సర్వశిక్ష పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సంగమేశ్వర ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజం మరింత పురోగతి చెందాలన్నా కుటుంబాల్లో పేదరికం పోవాలన్నా కుటుంబాల్లో సఖ్యత ఉండాలన్నా చదువు ఎంతో దోహదపడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి జాఫర్ సాధిక్, మండలంలోని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబాషిణి, రామస్వామిరెడ్డి, సునీత, మురళీకృష్ణ, క్రిష్ణ నాగప్రసాద్, సోమిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాధారణ అంశాలపై పట్టు అవసరం

- వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య
- ప్రాంతీయస్థాయి క్విజ్ కాంపిటీషన్ ప్రారంభం



మాట్లాడుతున్న వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య

వైవీయూ: విద్యార్థులు అకడమిక్ అంశాలతో పాటు సమకాలీన, సాధారణ అంశాలు(జనరల్ నాలెడ్జ్) పై పట్టు సాధించాలని యోగివేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య సూచించారు. శుక్రవారం యోగివేమన విశ్వవిద్యాలయం, ఏపీ ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో ప్రాంతీయ స్థాయి క్విజ్ కాంపిటీషన్ విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్‌బ్లాక్‌లో నిర్వహించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యార్థులు తమ పాఠ్యాంశాలకు సంబంధించిన అంశాలతో పాటు మన చుట్టూ జరిగే అంశాలను, జనరల్ స్టడీస్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జనరల్ నాలెడ్జ్‌పై కూడా దృష్టిసారించాలని తద్వారా పోటీపరీక్షల్లో ముందుండవచ్చని తెలిపారు. క్విజ్ కాంపిటీషన్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.వి. జయంత్‌కశ్యప్ మాట్లాడారు. రాయలసీమ, నెల్లూరు జిల్లాల నుంచి 22 టీంలు ఈ కాంపిటీషన్‌లో పాల్గొనడం విశేషం. ఏపీ ఉన్నతవిద్యామండలి అకడమిక్ కన్సల్టెంట్ డా. బి. యల్లారెడ్డి, ఏపీ ఉన్నతవిద్యామండలి నోడల్ అధికారి ఎం. రమేష్‌కుమార్, ఎ. నగేష్, వైవీయూ అధ్యాపకులు ఆచార్య కె. గంగయ్య, డా. సుభోష్‌చంద్ర, కె.శ్రీనివాసరావు, డా. టి. సురేష్‌బాబు పాల్గొన్నారు.

యువగళంతో టీడీపీకి మంగళమే

- సోనియా గాంధీని ఎదిరించిన ధీరుడు వైఎస్ జగన్
- ఆయనకు లోకేష్ భయం రుచి చూపిస్తాననడం హాస్యాస్పదం
- సీకే దిన్నె జెడ్పీటీసీ సభ్యుడు నరేన్ రామాంజులరెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు నరేన్ రామాంజులరెడ్డి

కడప కార్పొరేషన్: నారా లోకేష్ 'యువగళం'.. తెలుగుదేశం పార్టీకి మంగళం పాడేలా ఉందని చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాదయాత్రలో లోకేష్ అసత్యాలన్నీ పోగేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పైన, ప్రభుత్వంపైన బురదజల్లుతున్నారన్నారు. దివంగత వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రల్లో ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకుంటూ, భరోసా ఇస్తూ ముందుకు సాగారన్నారు. 30రోజుల లోకేష్ పాదయాత్రలో దూషణలు తప్పా మరేం లేవన్నారు. వ్యవసాయం దండగ అని, విద్యుత్ చార్జీలు తగ్గించమన్నందుకు బషీర్‌బాగ్‌లో కాల్చి చంపిన వారు నేడు రైతుల గురించి మాట్లాడటం విచిత్రంగా ఉందన్నారు. డ్వాక్రా వ్యవస్థను విచ్ఛిన్నం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ, వైఎస్సార్ చేయూత పథకాల ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు సోనియాను ఎదిరించిన ధీరుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయనకు భయం రుచి చూపిస్తానని లోకేష్ ఉత్తర కుమారుడి ప్రగల్భాలు పలుకుతున్నాడని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఐస్‌క్రీం రవి, జి. శ్రీనివాసులరెడ్డి, సుబ్బరాయుడు, క్రిష్టయ్య పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

- చెక్కును అందజేసిన ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



హోంగార్డు హరికృష్ణ తల్లి అన్నపూర్ణమ్మకు చెక్కును అందజేస్తున్న ఎస్పీ అన్బురాజన్

కడప అర్బన్: జిల్లా పోలీసు కార్యాలయంలో హోంగార్డుగా విధులను నిర్వర్తించే హరికృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ నేపథ్యంలో హరికృష్ణ కుటుంబానికి ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ రూ. 2 లక్షల ఆర్థిక సహాయం శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. పోలీసు వితరణ నిధి నుంచి ఈ ఆర్థిక సాయంను హోంగార్డు హరికృష్ణ తల్లి పి. అన్నపూర్ణమ్మకు అందజేశారు. రూ. 10 వేల ఫ్లాగ్ ఫండ్‌ను కూడా ఎస్పీ అందజేశారు. అంకితభావంతో విధులు నిర్వర్తించే హరికృష్ణ మరణించడం బాధాకరమన్నారస్థాయన కుటుంబానికి పోలీసుశాఖ అండగా ఉంటుందనీ భరోసా ఇచ్చారు. పోలీసు కార్యాలయం పరిపాలనాధికారి ఎన్. జ్యోతి, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్, ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్, జూనియర్ అసిస్టెంట్ మహజబీన్ పాల్గొన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

కమలాపురం : మండల పరిధిలోని సి.గోపులాపురం గ్రామంలో నిర్వహించిన సీతా రాముల కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన బండ లాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి శుక్రవారం నిర్వహించిన ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి 20 కాండ్లు రాగా వల్లూరు మండలం చిన్ననాగిరెడ్డిపల్లెకు చెందిన నారంగారి తారకరెడ్డి ఎద్లు అత్యధికంగా4007 అడుగులు రాతి దూలాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. అలాగే ఖాదర్‌ఖాన్ కొట్టాలుకు చెందిన బావశ్రీ ఎద్లు 3982 అడుగులతో ద్వితీయ స్థానంలో, దువ్వూరుకు చెందిన వేఘనాథరెడ్డి ఎద్లు 3750అడుగులతో తృతీయ స్థానంలో, ప్రొద్దుటూరు మండలం నాగాయపల్లెకు చెందిన రామాంజుల రెడ్డి ఎద్లు 3615 అడుగులతో నాల్గవ స్థానంలో, నాగాయపల్లెకు చెందిన మూలే వేమారెడ్డి ఎద్లు 3603 అడుగులతో ఐదవస్థానంలో నిలిచాయి. వారికి వరుసగా రూ.25వేలు, రూ.20,016, రూ.15వేలు, రూ.10,116, రూ.5,016 నగదు బహుమతులు నిర్వాహకులు అందజేశారు.

హైస్కూల్ తనిఖీ

వల్లూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కడప డివిజన్ డిప్యూటీ డీఈవో రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు జరుగుతున్న రోజు వారీ పరీక్షలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. వెనుక బడిన విద్యార్థులకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, 100 శాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో లిల్లెమ్మ, హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలపై భారాలు మోపుతున్న బీజేపీ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఓబులేసు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వంట గ్యాస్ ధరలను పెంచి ప్రజలపై భారాలను మోపుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని వైఎస్‌ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో రూ.440 ఉన్న గ్యాస్‌ను అధికారంలోకి వచ్చాక ఉచితంగా ఇస్తామని చెప్పి నేడు రూ.1250కి తీసుకువచ్చారని మండిపడ్డారు. దేశంలోని ప్రజలపై పెట్రోల్, డీజల్ ధరలను పెంచి ప్రజలను తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలంటే నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు అందించాలన్నారు. ప్రస్తుతం వేసవి కాలం వస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో విద్యుత్ కొరత రాకుండా చూడాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర నాయకులు సుబ్రమణ్యం, కేసీ బాదుల్లా, చంద్రశేఖర్, బషీరున్నీషా పాల్గొన్నారు.

ఆడపిల్లలను సంరక్షించుకుందాం!



స్ట్రీట్ వాక్ నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ నాగరాజు, ఇతర సిబ్బంది

కడప రూరల్: ఆడపిల్లల సంరక్షణను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఆడపిల్లల సంరక్షణ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం పటిష్టంగా అమలు పరచడంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈనెల 8 వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నారు. అందులో భాగంగా శుక్రవారం రిజిష్టర్ చేయించుకోని స్కానింగ్ సెంటర్లను గుర్తించడానికి డాక్టర్స్ ప్రాక్టీస్ చేస్తున్న ప్రాంతాలలో స్ట్రీట్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ నాగరాజు మాట్లాడుతూ జిల్లా అంతటా టీముల వారీగా ఏర్పడి స్ట్రీట్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆడపిల్లల సంరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా స్వీకరించాలన్నారు. రిజిష్టర్ చేయించుకోని స్కానింగ్ సెంటర్లపై చట్టపరమైన చర్యలు చేపడతామని తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ, డీఐఓ మల్లీశ్వరి, ఎ.ఉమామహేశ్వర్‌రెడ్డి, చంద్రారెడ్డి, సునీల్‌కుమార్, ఆ శాఖ సిబ్బంది కుమారి, వెంగల్ రెడ్డి, నవనీతమ్మ, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

డ్రైడేను తప్పనిసరిగా పాటించాలి

వల్లూరు : ప్రతి కుటుంబం వారంలో ఒక రోజు తప్పని సరిగా డ్రైడేగా పాటించడం వలన లార్వాల పెరుగుదలను నిరోధించి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. మండల పరిధిలోని థెరిసానగర్‌లో శుక్రవారం ఆయన పర్యటించి గ్రామంలో జరుగుతున్న లార్వా సర్వేను పరిశీలించారు. గ్రామంలోని ప్రజలతో వారి ఆరోగ్య పరిస్థితులను గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఫణీంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సైన్సు డే పోటీల్లో 'మను' విద్యార్థుల ప్రతిభ



సాధించిన పతకాలు, సర్టిఫికెట్స్‌తో విద్యార్థులు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని మను పాలిటెక్నిక్‌లో ఇటీవల నిర్వహించిన సైన్సు డే ప్రదర్శనా పోటీల్లో మొదటి రెండు బహుమతులను తమ కళాశాల విద్యార్థులకే దక్కడం అభినందనీయమని ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్ తెలిపారు. ఈ పోటీలకు నగరంలోని పలు కళాశాలలు, పాఠశాలల నుంచి ఎగ్జిబిట్లు వచ్చాయి. మంచి ఆలోచనతో కూడిన నమూనాలు, పోస్టర్స్, వీడియో కాన్సెప్ట్, మోడల్స్ ప్రదర్శించడంతోనే మొదటి రెండు బహుమతులను తమ విద్యార్థులే కైవసం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకుగాను శుక్రవారం సంబంధిత విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ ముఖ్సిత్‌ఖాన్‌తోపాటు హెచ్‌ఓడీ డాక్టర్ హాకీముద్దీన్‌లను ప్రత్యేకంగా అభినందించారు. అధ్యాపకులు డాక్టర్ హాకీముద్దీన్, మోహమ్మద్ సికిందస్ హుస్సేన్, ఖాజా మొయినుద్దీన్, అకిల్ అహ్మద్, అల్కమ్ మసూద్ పాల్గొన్నారు.

యువతకు పోలీసుల కౌన్సెలింగ్



కడప ఒన్‌టౌన్ ఆవరణలో కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ ఎన్.వి నాగరాజు

కడప అర్బన్: నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా.. ప్రజాజీవనానికి ఆటంకం కలిగించినా కఠినచర్యలు తప్పవనీ కడప ఒన్‌టౌన్ సీఐ నాగ రాజు హెచ్చరించారు. శుక్రవారం ఆయన తమ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొందరు యువకులు చెడునడతగా ప్రవర్తిస్తున్నారని గుర్తించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. యువత చెడు వ్యసనాలకు బానిసలుగా మారి తమ తల్లిదండ్రులకు, సమాజానికి చెడ్డపేరు తీసుకువస్తున్నారని.. ఇది సరికాదని సూచించారు. అలాంటి వారిపై పోలీసుల నిరంతరం నిఘా ఉంటుందన్న విషయాన్ని గుర్తించాలన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు శుక్రవారం కడప రిమ్స్ పీఎస్ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో సీఐ కె.రామచంద్ర ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత పరిస్థితుల్లో జరుగుతున్న సైబర్ నేరాల గురించి, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి వివరించారు. ఫేక్ కాల్స్, ఏటీఎంలలో మోసాలు, తదితర విషయాల గురించి అవగాహన కల్పించారు.

20వ డివిజన్‌లో విస్తృత ప్రచారం



వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న శ్రీరంజన్‌రెడ్డి తదితరులు

కడప కార్పొరేషన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని 20వ డివిజన్ కార్పొరేటర్ వై. మాధవి, డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి కోరారు. శుక్రవారం సాయంత్రం వారు పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటును వెన్నపూస రవీంద్రారెడ్డికి వేసి గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అర్జున్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీ కాలువకు రక్షణ గోడ నిర్మించాలి



విద్యుత్ నగర్‌లో ప్రజలు, సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: కడప నగరంలోని విద్యుత్ నగర్‌లో కేసీ కాలువకు రక్షణ గోడ నిర్మించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన కొండాయపల్లె, విద్యుత్ నగర్, నెహ్రూనగర్ ప్రాంతాలను పరిశీలించారు. విద్యుత్ నగర్‌లో పలు ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణాలకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. గుడి వెనుక భాగాన డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టాలని, నిర్మాణ పనుల వల్ల ఏర్పడే వ్యర్థాలు కాలువల్లో పడకుండా చూసుకోవాలని నిర్మాణదారులకు సూచించారు. ఎంహెచ్ఓ ప్రశాంత్ వర్ధన్, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి అంకాలమ్మ బ్రహ్మోత్సవాలు



మున్నెల్లిలోని అంకాలమ్మ మూలవిరాట్

బి.కోడూరు : కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా మండలంలోని మున్నెల్లిలో వెలసిన అంకాలమ్మ విరాజిల్లుతోంది. ఈమెను దర్శించుకుని కోర్కెలు కోరితే తప్పక నెరవేరడంతో పాటు విఘ్నాలు తొలగి సకల సౌభ్యాలు కలుగుతాయని ప్రజల గట్టి నమ్మకం. ఈ బ్రహ్మోత్సవాలను ఈనెల 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. 5వ తేదీ అకుపూజ, 6వ తేదీన ధ్వజారోహణం, 7న కలశ స్థాపన, చలిబిండి నానుబాలు కార్యక్రమాలు, 8వ తేదీన పగలు మున్నెల్లి, బోడుగుండుపల్లె గ్రామాలకు చెందిన సుడిబండ్లు, బి.మఠం మండలం కేశాపురం గ్రామానికి చెందిన కుంకుమబండ్లు, వెంకటాపురం గ్రామానికి చెందిన నగదాబండ్లు చూపరులను ఆకట్టుకుంటాయి. అదే రోజు మధ్యాహ్నం బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, తదితర వసతులను ఆలయ ధర్మకర్త ఓబుల్‌రెడ్డి ప్రభాకర్‌రెడ్డి కల్పించారు.

బాలభవిత కేంద్రం.. ప్రారంభానికి సిద్ధం



ప్రారంభానికి సిద్ధం చేస్తున్న బాలభవిత కేంద్రం భవనం

ప్రొద్దుటూరు క్రైం: జిల్లా ఆస్పత్రిలో కొత్తగా నిర్మిస్తున్న జిల్లా బాలభవిత కేంద్రం భవన సముదాయం ప్రారంభానికి సిద్ధమవుతోంది. ఆస్పత్రి ప్రాంగణంలో సుమారు రూ.2.83 కోట్లతో భవన సముదాయాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో రూ.80లక్షలతో బాలభవిత కేంద్రం, రూ.2.03 కోట్లతో మొదటి అంతస్తులో సెంట్రల్ ల్యాబ్, కాన్ఫరెన్స్‌హాల్, ఇతర నిర్మాణాలను చేపడుతున్నారు. ఇటీవల జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి వచ్చిన కలెక్టర్ విజయరామరాజు బాలభవిత కేంద్రం భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే దాదాపుగా పనులు పూర్తి అయ్యాయని, మిగిలిన బయటి ఫినిషింగ్ పనులను మరో వారం రోజుల్లో పూర్తి చేయనున్నట్లు సంబంధిత కాంట్రాక్టర్ తెలిపారు. ఈ నెల 10 నాటికి భవనాన్ని అధికారులకు అప్పగిస్తామని చెప్పారు. ప్రస్తుతం బాలభవిత కేంద్రం జిల్లా ఆస్పత్రిలోని పాత క్యాజువాలిటి విభాగంలో నిర్వహిస్తున్నారు.

ఆర్ట్ గ్యాలరీని సందర్శించిన కేంద్ర కారాగార అధికారులు



ఆర్ట్ గ్యాలరీని పరిశీలిస్తున్న కేంద్ర కారాగార అధికారులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కళాదర్శిని ఆర్ట్ గ్యాలరీని కడప కేంద్ర కారాగార డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కె.జవహర్‌బాబు శుక్రవారం సందర్శించారు. విద్యార్థులు రూపొందించిన కళాఖండాలను మెచ్చుకున్నారు. సామాజిక, మానసిక రుగ్మతలను నివారించి, ఉత్తమ సమాజ నిర్మాణానికి కళలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ముఖ్యంగా యువత ఏదో ఒక కళలో ప్రావీణ్యం లేదా కనీస పరిచయం సంపాదించాలని సూచించారు. ఆర్ట్ గ్యాలరీ ఇన్‌చార్జి డాక్టర్ కోట మృత్యుంజయరావు, డా. సతీష్ బాబు, అప్పలాచారి, ఈరప్ప పాల్గొన్నారు.

వన్యప్రాణులను రక్షించడం బాధ్యతగా భావించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ సిబ్బంది

బద్వేలు అర్బన్ : వన్యప్రాణులను రక్షించడం ప్రతిఒక్కరు బాధ్యతగా భావించాలని ఎఫ్ఆర్ఓ మధుబాబు పేర్కొన్నారు. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవికి నిప్పు పెట్టడం వలన మానవ మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదముందని అన్నారు. అడవులు కాలడం వలన తీవ్రమైన కాలుష్యం ఏర్పడి సరైన సమయంలో వర్షాలు కూడా పడవని వివరించారు. కార్యక్రమంలో డీఆర్ఓ వెంకటశేషయ్య, ఎఫ్‌బీఓలు శ్యాంసుందర్, సువర్ణకుమార్, రాజేష్‌రెడ్డి, రెడ్డెమ్మ, పుష్పరాజ్, ఏబీఓలు అక్బర్, సుంకయ్య, శాంతిప్రసన్న, మునాఫ్, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

పోరాడే వారినే చట్టసభలకు పంపండి

కమలాపురం : నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే వ్యక్తులనే చట్టసభలకు పంపాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ఓబులేసు తెలిపారు. శుక్రవారం స్థానిక డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు, పట్టభద్రులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పశ్చిమ రాయలసీమ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కత్తి నరసింహారెడ్డి, గ్రాడుయేట్స్ అభ్యర్థి పోతుల నాగరాజులను ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు గాలి చంద్ర, ఏఐటీయూసి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ బాదుల్లా, కమలాపురం ఏరియా కార్యదర్శి చంద్రశేఖర్, మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం సీతారాముల కల్యాణం

కమలాపురం : మండల పరిధిలోని సి.గోపులాపురంలో వెలసిన పరివార దేవతా సమేత పట్టాభిరామచంద్రస్వామి వారి కల్యాణం శుక్రవారం కమనీయంగా జరిగింది. ఆలయ పంచమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో వైభవరంగా నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యావాచనము, పంచామృత అభిషేకం, కుంకుమార్చన, శాంతి హోమం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పురోహితులు అమ్మవారికి మాంగల్యధారణ చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పుర వీధుల్లో ఊరేగించారు.

నేడు కార్యకర్తల సమావేశం

వీరపునాయునిపల్లె : స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్న కార్యకర్తల సమావేశంలో కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని మండల కన్వీనర్ మరియు మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చెన్నూరు : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శుక్రవారం కొండపేటలో పోలీసు కళాజాత బృందం ద్వారా ప్రజలను చైతన్య వంతులను చేశారు. కార్యక్రమంలో కళాజాత ఇన్‌చార్జి నరసరామ్ బృందంతోపాటు చెన్నూరు పోలీసు సిబ్బంది, కొండపేట గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
వైఎస్‌ఆర్‌ జిల్లా
శనివారం ॥ 4-3-2023

తెలుగు సాహిత్యలోకం నుంచి రచయిత్రి కె.రామలక్ష్మి (92) వీడ్కోలు తీసుకున్నారు. రచయిత్రిగా, ఆరుద్ర సతీమణిగా, మద్రాసు (చెన్నై) నగరంలో తెలుగువారి ప్రతినిధిగా, నాటి సాహితీ సమూహాలలో కీలకమైన వ్యక్తిగా, సినిమా రంగంలో రచయిత్రిగా ఆమె సాగించిన యాత్ర సుదీర్ఘమైనది. ఆమె మరణంతో ఒక కాలపు తెలుగు సాహితీ చరిత్రకు మిగిలిన ఆఖరు సాక్షి లేకుండా పోయినట్టయ్యింది.



● కె. రామలక్ష్మి

నివాళి

ఆమె ప్రతి అక్షరం స్త్రీ పక్షం

రచయిత్రి రామలక్ష్మి ఆరుద్ర కన్నుమూత

- అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నివాసంలో మృతి
- 100 కుపైగా పుస్తకాలు రాసిన రామలక్ష్మి
- జీవనజ్యోతి సినిమాకు ఉత్తమ కథా రచయితగా నంది అవార్డు
- జర్నలిస్టుగా, సెన్సార్‌ బోర్డు సభ్యురాలిగా సేవలు

ప్రముఖ రచయిత ఆరుద్ర సతీమణి కె.రామలక్ష్మి (92) కన్నుమూశారు. కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె.. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆస్మాన్‌ఘడ్‌లో ఉన్న నివాసంలో తుదిశ్వాస విడిచారు. రామలక్ష్మి ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా కోటనందూర్‌లో 1930 డిసెంబర్‌ 31న జన్మించారు. మద్రాస్‌ విశ్వవిద్యాలయంలో బీఏ పూర్తిచేశారు. ఆంగ్ల, ఆంధ్ర సాహిత్యం, ప్రాచీనాంధ్ర సాహిత్యం అభ్యసించారు. 1954లో ప్రముఖ కవి ఆరుద్రను వివాహం చేసుకున్నారు. వీరికి ఐదుగురు కుమార్తెలు. 1951 నుంచే రామలక్ష్మి రచనా ప్రస్థానం మొదలైంది. వివాహమైన తర్వాత 'రామలక్ష్మి ఆరుద్ర' కలం పేరుతో రచనలు చేశారు. మొత్తం 100 కు పైగా పుస్తకాలు రాశారు. ఆంధ్రపత్రికలో ఆమె సుదీర్ఘకాలం నిర్వహించిన 'ప్రశ్న జవాబు' శీర్షిక ప్రసిద్ధి చెందింది. విడదీసే రైలుబళ్లు, అవతలిగట్టు, మెరుపుతీగె, తొణికిన స్వర్గం, మానని గాయం, ఆణిముత్యం, పెళ్లి, ప్రేమించు ప్రేమకై, ఆడది, ఆశకు సంకెళ్లు, కరుణ కథ, లవంగి, ఆంధ్ర నాయకుడు, పాండురంగని ప్రతిజ్ఞ, నీదే నా హృదయం, అద్దం, ఒక జీవికి స్వేచ్ఛ వంటి కథా సంకలనాలను రామలక్ష్మి రచించారు. తెలుగు సాహిత్య రంగానికి చేసిన సేవలకు గాను ఆమెకు గృహలక్ష్మి, స్వర్ణకంకణం సహా పలు ప్రతిష్టాత్మక పురస్కారాలు దక్కాయి.

ఉత్తమ రచయిత్రిగా నంది అవార్డు...

రామలక్ష్మి పలు సినిమాలకు కథలు అందించారు. 1975వ సంవత్సరంలో జీవన జ్యోతి సినిమా కథకు గాను అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వం నుంచి నంది అవార్డు అందుకున్నారు. కాసా సుబ్బారావు నిర్వహించిన స్వతంత్ర దినపత్రికలో జర్నలిస్టుగా పని చేశారు. 1978లో ఉత్తమ జర్నలిస్టుగా రామానాయుడు అవార్డు అందుకున్నారు. పలు స్త్రీ సంక్షేమ సంఘాల్లో సేవలు అందించి మహిళల శ్రేయస్సు కోసం పాటుపడ్డారు. కేంద్ర ఫిల్మ్‌ సెన్సార్‌ బోర్డ్‌ రీజనల్‌ ప్యానెల్‌ సభ్యురాలిగా కూడా పనిచేశారు. రామలక్ష్మి ఆరుద్ర మృతిపట్ల పలువురు రచయితలు, సినీ, రాజకీయ, ఇతర రంగాల ప్రముఖులు సంతాపం తెలిపారు. శుక్రవారం సాయంత్రమే ఎస్‌ఆర్‌నగర్‌ శ్మశానవాటికలో ఆమె అంత్యక్రియలను నిర్వహించారు.

స్టెల్లా మేరీ స్టూడెంట్‌

స్వస్థలం కాకినాడ అయినా కె.రామలక్ష్మి చదువు చెన్నైలోనే సాగింది. స్టెల్లా మేరీ కాలేజీలో చదువుకుని ఇంగ్లిష్‌ భాషలో పట్టు సాధించారు. 'ఐ యామ్‌ ఏ స్టెల్లామేరియన్‌' అని గర్వంగా చెప్పుకునేవారు. కాలేజీలో ఒక కార్యక్రమానికి అతిథిగా హాజరైన ప్రఖ్యాత జర్నలిస్టు ఖాసా సుబ్బారావు ఇంగ్లిష్‌లో ఉపన్యాసం ఇచ్చిన కె.రామలక్ష్మిని చూసి పరీక్షలు అయిపోయాక తనని కలవమని చెప్పారు. 'స్వతంత్ర' పత్రికలో ఇంగ్లిష్‌ విభాగంలో పాత్రికేయురాలిగా ఉద్యోగం ఇచ్చారు. 'తెలుగు స్వతంత్ర'కు ఎడిటర్‌గా ఉన్న ఖాసా సుబ్బారావు కోరిక మేరకు 'నడుస్తున్న చరిత్ర' కాలమ్‌ రాశారు రామలక్ష్మి. ఆమె ఇంటిలో ప్రతి సాయంత్రం సాహితీచర్చలు జరిగేవి. వాటికి ఆరుద్ర, శ్రీరంగం



● కుమార్తెలు విజయ, త్రివేణి, కవిత, లలిత, వాసంతిలతో ఆరుద్ర, రామలక్ష్మి

నారాయణబాబు, శ్రీశ్రీ తదితరులు హాజరయ్యేవారు. ఆరుద్ర, రామలక్ష్మి పరస్పరం ఇష్టపడి ఆ రోజుల్లో అంటే 1954ఏప్రిల్‌30న రిజిస్టర్డ్‌ మేరేజీ చేసుకున్నారు. ఈ పెళ్లికి దర్శకుడు హెచ్‌.ఎం.రెడ్డి, శ్రీశ్రీ సాక్షి సంతకాలు చేశారు. శ్రీశ్రీ తన పెళ్లికి సాక్షి సంతకం చేయాలని ఆరుద్ర భావించడం వల్ల ఇది జరిగింది. శ్రీశ్రీ రామలక్ష్మిని 'అత్తగారు' అని సరదాగా పిలిచేవారు. అయితే శ్రీశ్రీ ధోరణిని రామలక్ష్మి చివరి వరకూ వ్యతిరేకిస్తూనే వచ్చారు.

ఆరుద్రకు అండా దండా

ఆరుద్ర సినిమా రంగంలో కృషి చేయడానికి, 'సమగ్రాంధ్ర చరిత్ర' పరిశోధన పూర్తి చేయడానికి రామలక్ష్మి అందించిన అండదండలే కారణం. వీరికి ఐదుగురు కుమార్తెలు విజయ, త్రివేణి, కవిత, లలిత, వాసంతి. వీరి పెంపకం, చదువు బాధ్యతలకోసం ఆరుద్ర సమయాన్ని తీసుకోకుండా ఆమే తన సమయమంతా వెచ్చించారు. 'ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యం కోసం విపరీతంగా సమయం ఇవ్వాలనుకునేవాడు. కాని ఇల్లు గడవాలి కదా. సినిమా రంగంలో పని చేస్తేనే డబ్బులు వస్తాయి. అందుకని నేనేమి అనకుండా గబగబా కొన్ని పాటలు రాసేసి ఆ డబ్బు అప్పజెప్పి మళ్లీ పరిశోధనలో పడేవాడు' అన్నారు రామలక్ష్మి. ఆరుద్రకు అనారోగ్యం వస్తే నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌ రెడ్డితో మాట్లాడి ప్రభుత్వ సహాయం అందేలా చూశారామె. 'నేను మరణించినప్పుడు ఎటువంటి హంగామా చేయవద్దు' అని ఆరుద్ర కోరడం వల్ల 1998లో ఆరుద్ర మరణించినప్పుడు కేవలం ముగ్గురు నలుగురు స్నేహితులతో కలిసి అంత్యక్రియలు నిర్వహించి ఆ తర్వాతే మరణవార్తను లోకానికి తెలియచేశారు. ఇది సాహిత్య ప్రియులను బాధించినా రామలక్ష్మి ధోరణి అలాగే ఉండేది.

సినిమా రచయిత్రి


కె.రామలక్ష్మికి సినిమా రంగంలో అందరూ సుపరిచితులు స్నేహితులు. వారిలో భానుమతి రామకృష్ణ, జయలలిత, వాణిశ్రీ తదితరులు ఉన్నారు. కె.విశ్వనాథ్‌ తీసిన 'జీవనజ్యోతి' సినిమాకు రామలక్ష్మి కథను అందించారు. ఈ సినిమా నిజానికి వాణిశ్రీ కోసమే రాశారు. కె.రామలక్ష్మి రాశారని వాణిశ్రీ నటించారు. దీని నిర్మాణ సమయంలో విశ్వనాథ్‌కు, రామలక్ష్మికి వాదోపవాదాలు నడిచాయి. దాంతో కె.విశ్వనాథ్‌ విజయవాడలో జరిగిన శతదినోత్సవంలో 'ఇకపై ఇతరులు రాసిన కథలతో నేను సినిమాలు తీయను' అని ప్రకటించారు. రామలక్ష్మి రాసిన మరో సినిమా 'గోరింటాకు'. అయితే దీని మీద ఆ రోజుల్లో వివాదం చెలరేగింది. దాసరి నారాయణరావు స్టోరీ డిపార్ట్‌మెంట్‌లో తెర వెనుక ఉండి పని చేసిన వారిలో రామలక్ష్మి కూడా ఒకరు. ఆమె 1970లలో సెన్సార్‌ బోర్డ్‌ మెంబర్‌గా పని చేశారు.

స్త్రీ పక్షపాతి

రామలక్ష్మి నిత్య జీవితంలోనే కాదు రచనా జీవితంలోనూ ఆధునికురాలు. ఛాందసాలు లేని జీవనం గడపాలని, భార్యాభర్తలు స్నేహమయ జీవనాన్ని అనుభవించాలని, స్త్రీలకు తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛ ఉండాలని ఆ రోజుల్లోనే తన కథలలో చెప్పారామె. 1954లో ఆమె తన తొలి కథా సంపుటి 'విడదీసే రైలుబళ్లు' వెలువరించారు. ఈ సంపుటిలోని 'చీలిన దారులు' అనే కథలో ఒక జంట పెళ్లి చేసుకోకుండా సహజీవనం ప్రారంభిస్తారు. 'పెళ్లి ప్రేమను చంపేస్తుంది' అని ఆ కథలో రాసి అప్పటికి తెలియని సహజీవనాన్ని ప్రతిపాదించారామె. 'తొణికిన స్వప్నం', 'ఒక జీవికి స్వేచ్ఛ', 'అద్దం' తదితరాలు ఆమె ఇతర కథా సంపుటాలు. భార్యాభర్తలు స్నేహితులుగా ఉండాలని సూచిస్తూ 1970లలో ఆమె రాసిన 'పార్వతి కృష్ణమూర్తి కథలు' పాఠకాదరణ పొందాయి. ఇందులో భార్య అరమరికలు లేకుండా భర్తతో తన అభిప్రాయాలను చెబుతుంది. స్నేహాన్ని, చొరవను ప్రదర్శిస్తుంది. భార్యంటే భర్త చెప్పినట్టుగా పడుండాలనే నాటి ధోరణికి ఈ పాత్ర పూర్తి భిన్నం. రామలక్ష్మి రాసిన కథల్లో 'అదెక్కడ' విశిష్టమైనది. ఆ కథలో ముఖ్య పాత్ర తన పేరు మర్చిపోతుంది. దాని కారణం భర్త, పిల్లలు అందరూ 'అది' అని పిలుస్తూ ఉండటమే. చివరకు ఆమె ఒకరోజు ఇంట్లో నుంచి వెళ్లిపోతుంది. భర్త 'అదెక్కడ' అని ఎందరిని అడిగినా కనిపించదు. పురుషుడు మోసం చేస్తే స్త్రీ సింగిల్‌ మదర్‌గా జీవించగలదనే సందేశం ఇస్తూ కథలు రాశారు. బేలగా ఉండే స్త్రీలను అలాంటి పాత్రలను రామలక్ష్మి హర్షించలేదు. స్త్రీలు ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా తమ జీవితాన్ని మలుచుకోవాలని కోరుతారు.

ఆమె రచనలను ఈ తరానికి మళ్లీ చేరువ చేయాల్సి ఉంది.

కళ





● విజేత కుమార్‌

ఫుట్‌బాల్‌ చెప్పిన కథ

మార్పు అనేది సామాజిక ఉద్యమాలతోనే కాదు...సరదాగా మొదలయ్యే ఆటలతో కూడా సాధ్యపడుతుందని నిరూపించింది రాజస్థాన్‌కు చెందిన మహిళా జన్‌ అధికార్‌ సమితి. ఫుట్‌బాల్‌ ఆటతో అమ్మాయిల ఆలోచన ధోరణిలో వచ్చిన మార్పు, చైతన్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది కికింగ్‌ బాల్స్‌...

రాజస్థాన్‌లో అనేక ప్రాంతాల్లో బాల్యవివాహాలు సర్వసాధారణం. దీన్ని దృష్టిలో పెట్టుకొని బాల్యవివాహాలకు అడ్డకట్టవేయడానికి మహిళా జన్‌ అధికార్‌ సమితి అమ్మాయిల కోసం ఊళ్లలో 'ఫుట్‌బాల్‌ క్లబ్‌'లను ఏర్పాటు చేసింది.

బాల్యవివాహాల నిరోధానికి, ఫుట్‌బాల్‌ ఆటకు సంబంధం ఏమిటి? అనే సందేహం సహజంగానే వస్తుంది. అయితే ఆ ఫుట్‌బాల్‌ క్లబ్‌లు ఆట మెలకువలకు మాత్రమే పరిమితం కాకుండా పరివర్తన కేంద్రాలుగా మారడమే కొసమెరుపు.

ఆట ఆడటం కోసం సాయంత్రం ఎంతో మంది అమ్మాయిలు గ్రౌండ్‌కు వస్తారు. ఆట పుణ్యమా అని వారి మధ్య స్నేహం పెరిగింది. ఆట అయిపోయిన తరువాత రకరకాల కబుర్లు చెప్పుకునేవారు. అన్ని విషయాలతో పాటు బాల్యవివాహాల టాపిక్‌ కూడా వచ్చేది.

అంతమాత్రాన పెద్దలను వ్యతిరేకించగలరా? తరాల సంప్రదాయాన్ని కాదనగలరా?

'అవును....అనగలరు' అని ఎందరో అమ్మాయిలు నిరూపించారు. 'చదువు తరువాతే పెళ్లి' అని తల్లిదండ్రులతో గట్టిగా చెప్పారు.

కట్‌ చేస్తే...

ముంబైలో ఉంటున్న విజేత కుమార్‌ బ్రాండెడ్‌ కంటెంట్, మ్యూజిక్‌ వీడియోలు రూపొందించడంలో మంచి పేరు తెచ్చుకుంది. తన తొలి షార్ట్‌ ఫిల్మ్‌ 'బ్లాజ్‌' న్యూయార్క్‌ షార్ట్‌ ఫిల్మ్‌ ఫెస్టివల్‌లో 'బెస్ట్‌ షార్ట్‌ ఫిల్మ్‌' అవార్డ్‌ అందుకుంది.

కొంత కాలం క్రితం విజేత తన స్వస్థలం రాజస్థాన్‌లోని అజ్మీర్‌కు వెళ్లింది. ఒక సాయంత్రం పూట బాల్య జ్ఞాపకాలను పలకరించడానికి తాను చదువుకున్న స్కూలుకు వెళ్లింది. అక్కడ ఆడపిల్లలు చాలా సీరియస్‌గా ఫుట్‌బాల్‌ ఆడుతుంటే అబ్బురపడింది.

ఆసక్తిగా ఆ అమ్మాయిలను పలకరించింది విజేత.

'స్కూల్‌ పూర్తయిన తరువాత ఇంటికి వెళితే ఇక బయట అడుగుపెట్టడం అంటూ ఉండేది కాదు. అలాంటిది ఫుట్‌బాల్‌ ఆట వల్ల రోజూ సాయంత్రం గ్రౌండ్‌కు రాగలుగుతున్నాను' అని తనకు లభించిన స్వేచ్ఛ గురించి చెప్పింది ఒక అమ్మాయి.

ఫుట్‌బాల్‌ ఆట వల్ల తమలో పెరిగిన

> 'వావ్‌' అనుకోవడమే కాదు డాక్యుమెంటరీ తీయాలని కూడా అనుకుంది విజేత. అనేకానేక సందేహాలతో తొలుత వారు కెమెరా ముందుకు రావడానికి నిరాకరించారు. అయితే విజేతకు వారితో స్నేహం పెరిగాక, తన మీద నమ్మకం ఏర్పడిన తరువాత 'కికింగ్‌ బాల్స్‌' పేరుతో డాక్యుమెంటరీ రూపుదిద్దుకుంది.

ఆత్మవిశ్వాసం, నలుగురితో కలిస్తే వచ్చే ధైర్యం, బాల్యవివాహాలపై వ్యతిరేకత గురించి మరో అమ్మాయి వివరంగా చెప్పింది. ఇలా అందరూ తమ అభిప్రాయాలను పంచుకున్నారు.


'వావ్‌' అనుకోవడమే కాదు డాక్యుమెంటరీ తీయాలని కూడా అనుకుంది విజేత. అనేకానేక సందేహాలతో తొలుత వారు కెమెరా ముందుకు రావడానికి నిరాకరించారు. అయితే విజేతకు వారితో స్నేహం పెరిగాక, తన మీద నమ్మకం ఏర్పడిన తరువాత 'కికింగ్‌ బాల్స్‌' పేరుతో డాక్యుమెంటరీ రూపుదిద్దుకుంది.

పిల్లలతో కలిసి ఈ డాక్యుమెంటరీని చూసింది విజేత. 'కికింగ్‌ బాల్స్‌' పిల్లలకు నచ్చింది. ఆ తరువాత ప్రపంచ ప్రేక్షకులకు కూడా నచ్చింది.

బ్యూటిప్స్‌

ఏమి చేయకూడదంటే...

అందానికి చిట్కాలు పాటించడానికి ముందు ఏమేం చేయకూడదో తెలుసుకుంటే మంచిదేమో! ఇవన్నీ తెలిసినవే, అయినా ముఖ్యంగా నిర్లక్ష్యం చేసేదిక్కడే.



● మొటిమలను గిల్లితే, మచ్చలు పడతాయి. వీటిని పోగొట్టుకోవడానికి చాలా కష్టపడాలి. గిల్లినప్పుడు మొటిమల నుండి వెలువడిన స్రావం ముఖం మీద ఎక్కడ తగిలితే అక్కడ కూడా మొటిమలు వస్తాయి. ● ఫంక్షన్‌కు వెళ్లే ముందు మేకప్‌ వేసుకుంటాం, కానీ తిరిగి వచ్చాక తుడిచేయడానికి బద్ధకించి అలాగే నిద్రపోతాం. కొబ్బరినూనెతో తుడుచుకునేంత ఓపిక లేకపోతే కనీసం గోరువెచ్చని నీటిలో కాటన్‌ ముంచి అయినా మేకప్‌ క్లీన్‌ చేయాలి. ● మేకప్‌ సామగ్రిని ప్రతి ఆరునెలలకొకసారి అప్‌డేట్‌ చేసుకోవాలి. ఎక్స్‌పైరీ డేట్‌ చెక్‌ చేసుకుని, వాటిని కిట్‌ నుండి తొలగించాలి. ● మేకప్‌లో ఫౌండేషన్‌ ఇంపార్టెంట్‌. దీన్ని జాగ్రత్తగా వేసుకోవాలి. స్కిన్‌ కలర్‌కు సూటయ్యే షేడ్‌ వాడాలి. అవసరమైన మేరకే వాడాలి. ● హెయిర్‌ కండిషనర్‌ వాడేటప్పుడు చిన్న జాగ్రత్త కావాలి. జుట్టు కుదుళ్లకు తగలకుండా అప్లై చేయాలి. జుట్టు పొడిబారినప్పుడు మాత్రమే కండిషనర్‌ వాడాలి.

ఇంటిప్స్‌

సహజమైన రూమ్‌ ఫ్రెషనర్‌

- అరకప్పు టేబుల్‌ సాల్ట్‌ తీసుకుని, అందులో గులాబీ రేకులను వేయాలి. వీటితోపాటు ఒక స్పూన్‌ లవెండర్‌ ఆయిల్‌ లేదా ఆల్మండ్‌ ఆయిల్‌ వేయాలి. అంతే! గది సువాసనలతో నిండిపోతుంది.
- దీన్ని మరింత సులువుగా చేయాలంటే వొలిచిన నారింజ లేదా కమలా పండు మీద టేబుల్‌ స్పూన్‌ సాల్ట్‌ను చల్లి ఒక మూలన పెడితే సరి!
- సింక్‌ మెరవడానికి: ఖరీదైన క్లెన్సర్‌ జోలికి పోకుండా సింక్‌ పరిశుభ్రంగా... కొత్త దానిలా కనిపించాలంటే... నిమ్మరసంలో కొద్దిగా టేబుల్‌ సాల్ట్‌ వేసి సింక్‌ను తుడిస్తే చాలు... చూస్తుండగానే సింక్‌ కొత్తదానిలా మెరుస్తుంది.



● పచ్చదనాల పొదరిల్లు

మొక్కలో మొక్కనై!

**మందారాలు 16 రంగులున్నాయి.
జామ చెట్లు ఏడురకాలున్నాయి.
అరటి పండ్ల చెట్లు ఐదు రకాలు.
వేప, సీమచింత, కానుగ...
మర్రి, రావి, జువ్వి, కొబ్బరి...
కుండీల్లో ఒదిగిపోయాయి.
రణపాల, కొండపిండి...
ఇన్సులిన్‌ ప్లాంట్, కప్పరిల్ల...
ఔషధమొక్కల లిస్ట్‌ ఇది.
ఇవన్నీ ఉన్నది నర్సరీలో కాదు.
మొక్కల్ని పిల్లల్లా పెంచే మంజుల ఇంట్లో.
మనం తినే పంటలు పండించుకుంటున్నాం.
పీల్చే గాలిని కూడా 'పెంచుకుందాం' అంటోందామె.**

''ఆమెకు గ్రీన్‌ ఇండియా చాలెంజ్‌ విసిరిన వాళ్లు లేరు. తనకు తానుగా తీసుకున్న చాలెంజ్‌ కూడా కాదు. ఆమె మనసు కోరుకున్న ముచ్చట. పచ్చదనంతో ఆమె పాతికేళ్ల ప్రస్థానానికి ప్రతిరూపం ఈ ఇల్లు. ఆంధ్రప్రదేశ్, నెల్లూరు జిల్లా, గంగపట్నం గ్రామంలో 65 అంకణాల స్థలంలో ఉన్న ఈ ఇంటి పేరు 'జీఆర్‌కే గార్డెన్‌'. గేటు ముందు నిలబడి చూస్తే ఇల్లు కనిపించదు. అల్లిబిల్లిగా అల్లుకున్నట్లున్న చెట్లు, తీగలను తొలగించి చూస్తే తప్ప గోడలు కనిపించవు. ఎన్ని మొక్కలున్నాయి? ఎన్ని రకాలున్నాయి? అని లెక్కపెట్టాలంటే సాధ్యమయ్యేటట్లు కనిపించలేదు. ఆ వివరాలన్నీ ఈ మొక్కల తల్లి మంజుల చెప్పాల్సిందే.

సేకరణ చిన్న పని కాదు!

''నేను ఐసీడీఎస్‌లో ఇన్‌చార్జ్‌ సూపర్‌వైజర్‌ని. ఉద్యోగంలో పిల్లల్ని చూసుకోవడం, ఇంట్లో మొక్కల్ని పెంచుకోవడమే నా లైఫ్‌. పండ్ల మొక్కలు దేశీవిదేశీ అన్నీ కలిపి వందకు పైగా ఉన్నాయి. తీగజాతితో కలిపి పూల మొక్కలు వందల్లో ఉన్నాయి. బాటిల్స్, కుండీలు, డ్రమ్ములు మూడు వేలకు పైగా ఉన్నాయి. నా దగ్గర పేపర్‌ వైట్‌ మొక్క కూడా ఉంది. యూ ట్యూబ్‌లో మ్యాడ్‌ గార్డెనర్‌ మాధవి గారి గార్డెన్‌ నుంచి తీగజాతులు తెప్పించుకున్నాను. హైదరాబాద్‌ నర్సరీ మేళాల నుంచి సేకరించాను. బెంగళూరు నుంచి కూడా తెచ్చుకున్నాను. మొక్కలు ఎన్ని కొంటున్నానో లెక్క చూసుకోకుండా కొనేస్తాను. కానీ బస్సు వాళ్లను రిక్వెస్ట్‌ చేసి వాటిని ఇంటికి తెచ్చుకోవడం చాలా కష్టమయ్యేది. స్వయంగా వెళ్లడం కుదరని నర్సరీలకు ఫోన్‌ చేసి వీడియో కాల్‌లో అక్కడ ఉన్న మొక్కలను చూసి నా దగ్గర లేనివేవో చెప్పి తెప్పించుకుంటున్నాను. యాలకులు, మిరియాలు, దాల్చిన చెక్క, జాపత్రి వంటి సుగంధ ద్రవ్యాల మొక్కలన్నీ ఉన్నాయి, కానీ లవంగాల తీగ మాత్రం దొరకలేదు.

సీతాఫల కుటుంబం

సీతాఫలం మనకు బాగా తెలుసు. నా దగ్గర రామాఫలం, లక్ష్మణఫలం, హనుమఫలం కూడా ఉన్నాయి. కుండీల్లో కాసే పనస నుంచి యాపిల్‌ మూడు రకాలు, కివీ, అవొకాడో కూడా పెంచుతున్నాను. ఓ సారి ఎవరితోనో మాట్లాడుతూ 'మా పాప కంటే ముందు మొక్కలనే చూసుకుంటాన'ని చెప్పాను. ఆ మాటను గుర్తు చేసి మరీ దెప్పుతుంటుంది మా అమ్మాయి. తానిప్పుడు హైదరాబాద్‌లో చదువుకుంటోంది. మా వారు కృష్ణపట్నం పోర్టులో ట్రాన్స్‌పోర్ట్‌ సూపర్‌వైజర్‌. ఆయనకు ఇంటి నిండా మొక్కలున్నాయని మాత్రమే తెలుసు. మొక్కల పేర్లు కూడా తెలియదు. ఆయన మొక్కల సరదా అంతా సెల్ఫీలు తీసుకుని వాట్సాప్‌ డీపీలు పెట్టుకోవడం వరకే. మొక్కల పని అంతా నేను, మా అమ్మ చూసుకుంటాం. ఉదయం రెండు గంటల సేపు నేను టెర్రస్‌ మీద పని చేస్తాను. నేను, మా వారు డ్యూటీలకు వెళ్లిన తర్వాత మా అమ్మ మూడు గంటల సేపు కింద ఉన్న మొక్కల పని చూసుకుంటుంది. సాయంత్రం వచ్చిన తర్వాత కూడా నాకు గంట– రెండు గంటల సేపు ఎరువు కలపడం వంటి ఏదో ఒక పని ఉంటుంది.

చెట్లమ్మ

మా ఇంటి ఇరుగుపొరుగు వాళ్లు 'టెర్రస్‌ మీద ఇంత బరువు పెడుతున్నావు. ఇల్లు జాగ్రత్త' అంటూ ఉంటారు. ఇల్లు పాడయితే మరో చిన్న ఇల్లు కట్టుకుంటాను. మొక్కలు పోతే మళ్లీ మొక్కలు పెరగాలంటే ఎన్నో ఏళ్లు పడుతుందని చెబుతాను. నీ చుట్టుపక్కల ఉండడం మాకూ మేలే. మేము పెంచకపోయినా నువ్వు పెంచిన మొక్కల గాలిని పీల్చుకుంటున్నాం అని నవ్వుతారు. మా చెల్లి కొడుకైతే నన్ను చెట్లమ్మ అనే పిలుస్తాడు. ప్రతి ఇల్లూ మొక్కల్ని పెంచితే గాలి ఎందుకు కలుషితమవుతుంది? దారికి అడ్డు వస్తోందని, మరేదో పనులకు ఇబ్బందవుతోందని... ఎన్నో ఏళ్లు పెరిగిన చెట్టుని నిలువునా నరికేస్తుంటారు. పెరిగిన చెట్టుని నరకడం కాదు, ఒక చెట్టుని పెంచి చూడండి అని గొంతెత్తి అరవాలనిపిస్తుంటుంది'' అని మొక్కల మీద తన ప్రేమను వ్యక్తం చేశారు గుడి మంజుల.

– వాకా మంజులారెడ్డి

ఎనిమిదిళ్లు మారాను!

మొక్కల కోసం మార్కెట్‌లో దొరికే కుండీలు చాలవని పెద్ద పెద్ద సిమెంట్‌ కుండీలు కూడా నేనే స్వయంగా చేసుకున్నాను. ఇల్లు మారిన ప్రతిసారీ ఈ కుండీలను తీసుకెళ్లడం ఎంత కష్టమయ్యేదో. అలా ఎనిమిదిళ్లు తిప్పాను. నా కష్టం చూసి మా నాన్న ఈ ఇల్లు అమ్మకానికి వచ్చిన సంగతి తెలిసి వెంటనే కొన్నారు. అప్పుడు కూడా 'నీకు ఇల్లు' అని చెప్పలేదు. 'నువ్వు మొక్కలు పెంచుకోవడానికి ఇల్లు' అని చెప్పారు. నాన్న గుర్తుగా నాటిన మామిడి చెట్టు చూడండి ఎంత ఎదిగిందో చూడండి.



– గుడి మంజుల, మొక్కల ప్రేమికురాలు